• నేడు రంజాన్ పండుగ శుభాకాంక్షలు 5



నేటి దినపత్రిక
18వ వసంతంలోకి...
సూర్య
www.suryaa.com
ఎన్టీఆర్ - కృష్ణా
సోమవారం 31 మార్చి 2025 పేజీలు 8

# పేదరికం లేని సమాజమే నా జీవితాశయం



- గత ప్రభుత్వంలో అందరికీ అవమానాలే... ఇక వచ్చే ఐదేళ్లూ అందరికీ రాజపూజ్యం
- ఈ ఉగాది తెలుగువారి జీవితాల్లో వెలుగులు నింపాలి
- ముఖ్యమంత్రి చంద్రబాబు నాయుడు
- తుమ్మలపల్లి కళాక్షేత్రంలో నిర్వహించిన ఉగాది వేడుకల్లో పాల్గొన్న సీఎం
- వివిధ రంగాల్లో సేవలు అందించిన వారికి కళారత్న, ఉగాది అవార్డుల ప్రదానం

**విజయవాడ బ్యూరో, మార్చి 30, మేజర్ న్యూస్ :** పేదరికం లేని సమాజమే తన జీవితాశయమని అందులో భాగంగానే పీ4 కార్యక్రమానికి శ్రీకారం చుడుతున్నామని ఏపీ సీఎం చంద్రబాబు నాయుడు అన్నారు. శ్రీ విశ్వావసు నామ సంవత్సర ఉగాది పండుగ ప్రజలందరి జీవితాల్లో కొత్త వెలుగులు తేవాలని, సుఖసంతోషాలు వెల్లివిరియాలని ఆయన ఆకాంక్షించారు. విజయవాడ తుమ్మలపల్లి కళాక్షేత్రంలో రాష్ట్ర ప్రభుత్వం ఆధ్వర్యంలో నిర్వహించిన ఉగాది వేడుకల్లో ముఖ్యమంత్రి చంద్రబాబు పాల్గొన్నారు. తొలుత ప్రత్యేక పూజలు చేశారు. అనంతరం పద్మశ్రీ మాడుగుల నాగఫణి శర్మ నిర్వహించిన పంచాంగ శ్రవణంలో చంద్రబాబు పాల్గొన్నారు. టీటీడీ పంచాంగం సహా వ్యవసాయ శాఖ, ఉద్యానశాఖ పంచాంగాలను సీఎం ఆవిష్కరించారు. అనంతరం రాష్ట్ర ప్రభుత్వ సాంస్కృతిక శాఖ వార్షిక ఉత్సవాల క్యాలెండర్‌ను ఆవిష్కరించారు. ఈ సందర్భంగా ముఖ్యమంత్రి చంద్రబాబు మిగతా 2లో

## పండుగలు మన సంస్కృతిలో భాగం



- సమాజ బాగు కోసం తపనపడే వ్యక్తి వెంకయ్యనాయుడు
- స్వర్ణభారత్ ట్రస్ట్ ఉగాది సంబరాల్లో ముఖ్యమంత్రి చంద్రబాబు నాయుడు

2

## నూతన సంవత్సరంలో మంచి ఆలోచనలతో

# మొదటి అడుగు వేయాలి

జిల్లా కలెక్టర్ డీకే బాలాజీ

వివరాలు 2లో...

## సొంతింటి కల నెరవేర్చడమే లక్ష్యం

### రాష్ట్ర మంత్రి కొల్లు రవీంద్ర




**మచిలీపట్నం మేజర్ న్యూస్ :** పేదల సొంతింటి కల నెరవేర్చడమే రాష్ట్ర ప్రభుత్వ లక్ష్యమని రాష్ట్ర గనులు భూగర్భ వనరులు ఎక్సైజ్ శాఖ మంత్రి కొల్లు రవీంద్ర పేర్కొన్నారు. శ్రీ విశ్వావసు నామ సంవత్సర ఉగాది పర్వదినం సందర్భంగా ఆదివారం ఉదయం నగరంలోని గో సంఘం లో జి ప్లస్ త్రీ టిడ్కో ఇళ్లను1700 మంది గృహ నిర్మాణ లబ్ధిదారులకు ఇళ్ళ తాళాలు, డాక్యుమెంట్లను మంత్రి అందజేశారు. ఈ సందర్భంగా మంత్రి మాట్లాడుతూ నూతన సంవత్సరంలో రాష్ట్ర ప్రజలందరికీ మంచి జరగాలని చక్కగా వర్షాలు కురిసి చక్కగా పంటలు పండాలని, ఉపాధి అవకాశాలు బాగా పొందాలని ఆకాంక్షించారు. రాష్ట్ర ముఖ్యమంత్రి నారా చంద్రబాబు నాయుడు చేపట్టే అభివృద్ధి కార్యక్రమాలకు భగవంతుని ఆశీస్సులు ఉండాలని కోరుకుంటున్నామన్నారు. 2014-19 లో తమ ప్రభుత్వం మునిసిపల్ ప్రాంతాలలో మిగతా 2లో...



**నందిగామ, మార్చి 29, మేజర్ న్యూస్ :** తాగే పాలు నుంచి తినే ఆహార పదార్థాల వరకు సర్వం కల్తీలమయం అవుతున్నాయి. కష్టపడకుండా అక్రమ మార్గంలో డబ్బులు సంపాదించుకునేందుకు కొంతమంది పాల్పడుతున్నారు. ఈ కల్తీ ప్రజారోగ్యాన్ని హరించడమే కాకుండా భవిష్యత్తు తరాల మనుగడను ప్రశ్నార్థకంగా మారుస్తున్నాయి. ఫలితంగా ఏది కొనాలో.. ఏది తినాలో తెలియని పరిస్థితి ప్రజల్లో నెలకొంది. ప్రస్తుతం కోళ్ల ఫారాల లోని కోళ్లు వైరస్ సోకి వేలకు వేల మిగతా 2లో

# కల్తీ దందా..

## ప్రజల ఆరోగ్యంతో చెలగాటం

- చూసి చూడనట్టు వ్యవహరిస్తున్న ఆహార తనిఖీ అధికారులు
- సంపాదనలో ఆసుపత్రులకు సగం చెల్లింపు
- ఈ అలవాట్లు లేకపోయినా ఆకస్మికంగా చనిపోతున్న యువత
- ప్రజల జీవితాలతో చెలగాటం ఆడుతున్న కల్తీ మాఫియా

(మొదటిపేజీ తరువాయి)

## కల్తీ దందా..ప్రజల ఆరోగ్యంతో చెలగాటం

చనిపోతున్నాయి. అయినా వాటిపై ఎటువంటి నియంత్రణ లేకపోవడం అధికారుల బాధ్యతా రాహిత్యం గా కనబడుతోంది.అక్రమార్జన కోసం హోటల్స్ లో ఆహార పదార్థాలు, చిన్నపిల్లలు తినే పాప్కార్న్ నుంచి ఇళ్లల్లో వాడే పప్పులు,అప్పడాలు,జీడిపప్పు, బాదంపప్పు వరకు కల్తీ చేస్తున్నారు. నియోజకవర్గంలో పలు హోటల్స్, రెస్టారెంట్లు నిల్వ ఉన్న కుళ్లిపోయిన మాంసము, చేపలు వినియోగించి ఆహార పదార్థాలు తయారు చేసి వినియోగదారులకు విక్రయిస్తున్నారు, పెద్ద పెద్ద హోటల్స్ లోనే నిల్వ చేపలు, మాంసం వినియోగిస్తున్నారని ఆరోపణలు ఉన్నాయి. ప్రముఖ బ్రాండ్ కంపెనీలతో పేరుతో మార్కెట్లోకి వస్తున్న కల్తీ నూనెలను హోటళ్లలో వినియోగిస్తున్నారు. తక్కువ ధరకు లభిస్తున్న జంతువుల నుంచి తయారుచేసిన నూనెలను ఉపయోగిస్తూ ఆహార పదార్థాలను తయారు చేసి విక్రయిస్తు ప్రజల జీవితాలతో చెలగాటమాడుతున్నరనే విమర్శలు వెలువెత్తుతున్నాయి. కొనుగోలు దారుల నుంచి అధిక ధరలు వసూలు చేస్తున్న వారికి నాణ్యమైన ఆహార పదార్థాలు బదులు నిల్వ మాంసము, చేప లు తో తయారుచేసిన పదా ర్థాలు అంటగడుతున్నారు. అయినా అధికారులు వాటి వైపు కన్నెత్తి చూడడం లేదని ఆరోపణలు ఉన్నాయి. ఆహార పదార్థాలు, నిత్యవసర సరుకులు, వ్యవసాయ ఉత్పత్తుల్లో,యథేచ్ఛగా కల్తీ కొనసాగుతుంది. ప్రధానం కారం, పసుపు, నూనె,నెయ్యి,పాలు, పప్పులు, ఇలా చెప్పుకుంటూ పోతే కల్తీకి కాదేది అనర్హంగా మారింది. ఆహార పదార్థాలతో అక్రమార్కులు కల్తీకి పాల్పడుతూ ప్రజల ప్రాణాలతో చెలగాట మాడుతున్నారు. ఆహార ఉత్పత్తుల్లో నాణ్యతను నిర్ధారించాల్సిన అధికారులు, ఉద్యోగులు కల్తీ వ్యాపారులు ఇచ్చే మామూళ్లు తీసుకొని సరిపెట్టకుంటున్నారని విమర్శలు ఉన్నాయి. వినియోగదారులకు నాణ్యత లేని పదార్థాలను అంటగడుతున్నారు. ప్రధానంగా పర్యావరణం,ఫుడ్ ఇన్స్పెక్టర్లు, తూనికలు కొలతలు ఇతర విభాగా ల అధికారులు పూర్తిగా వైఫల్యం చెందారనే చెప్పాలి. ఆహార పదార్థాలు కల్తీలకు పాల్పడే అక్రమార్కులపై ప్రభుత్వం ఉక్కు పాదం మోపాల్సిన అవసరం ఎంతైనా ఉంది.అప్పుడే కల్తీలు, నకిలీలను కట్టడి చేసే అవకాశం ఉంటుందని పలువురు సూచిస్తున్నారు.

## సొంతింటి కల నెరవేర్చడమే లక్ష్యం

జి ప్లస్ త్రీ ఇళ్ల నిర్మాణానికి శ్రీకారం చుట్టిందన్నారు మచిలీపట్నం మున్సిపాలిటీలో 6,400 ఇళ్ళు మంజూరు అయితే అందులో 4 వేల ఇల్లు నిర్మాణం చేపట్టడం జరిగిందన్నారు. ఈలోగా ఆగిపోయాయన్నారు. అందులో 2, 300 ఇళ్లు పూర్తయ్యాయన్నారు. ఈరోజు 1700 మందికి ఇంటి తాళాలతో పాటు డాక్యుమెంట్లు అందజేశామని, ఉగాది పండుగ కానుకగా ఇచ్చామని, ఇదొక శుభదినం అన్నారు. పేదల సొంతింటి కల నెరవేర్చడం అదృష్టంగా భావిస్తున్నామన్నారు. ఇంకా 1800 మంది ఇల్లు ఉన్నాయని, వాటిని కూడా త్వరలో పూర్తి చేస్తామన్నారు. ఇంకా డ్రా తీసినవారు 4,200 మంది ఉన్నారని వారికి కూడా ఇల్లు నిర్మించి ఇస్తామన్నారు. గతంలో సెంటు భూమి ఇచ్చిన వారు ఇల్లు నిర్మించుకుంటున్నారని, కొంతమందికి 2 సెంట్లు భూమి ఇవ్వనున్నామని ఒక్కొక్క ఇల్లు 3 లక్షల రూపాయల వ్యయంతో నిర్మించడం జరుగుతుందన్నారు. ఎస్సీ ఎస్టీలు అయితే అదనంగా 50 వేల రూపాయలు అందజేయడం జరుగుతుందన్నారు. ఈ కార్యక్రమంలో ఏపీఎస్ఆర్టీసీ చైర్మన్ కొనకళ్ల నారాయణ రావు, మాజీ మున్సిపల్ చైర్మన్ మోటమర్రి బాబా ప్రసాద్, స్థానిక నాయకులు గొర్రెపాటి గోపీచంద్ గృహ లబ్ధిదారులు తదితరులు పాల్గొన్నారు.

## నూతన సంవత్సరంలో మంచి ఆలోచనలతో మొదటి అడుగు వేయాలి

**మచిలీపట్నం మేజర్ న్యూస్ :** ఆదివారం ఉదయం నగరంలోని బచ్చుపేట శ్రీ వేంకటేశ్వర స్వామి కళ్యాణ మండపం లో దేవాదాయ ధర్మాదాయ శాఖ ఆధ్వర్యంలో శ్రీ విశ్వావసు నూతన నామ సంవత్సర ఉగాది వేడుకలు ఘనంగా జరిగాయి. ఈ వేడుకలను జిల్లా కలెక్టర్ డీకే బాలాజీ జ్యోతి ప్రజ్వలన గావించి ప్రారంభించారు ఈ కార్యక్రమంలో ఏపీఎస్ఆర్టీసీ చైర్మన్ కొనకళ్ళ నారాయణ రావు, సంయుక్త కలెక్టర్ గీతాంజలి శర్మ పాల్గొన్నారు. ఈ సందర్భంగా జిల్లా కలెక్టర్ అందరికీ నూతన సంవత్సర శుభాకాంక్షలు తెలిపారు. విష్ణుభట్ల సూర్యనారాయణ శర్మ పంచాంగ శ్రవణం చేశారు ఈ సంవత్సరం రైతులకు కార్మికులకు పాలకులకు అధికారులకు అందరికీ యోగదాయకమైన అనుకూలమైన సంవత్సరం అన్నారు. అనంతరం ఏపీఎస్ఆర్టీసీ చైర్మన్ కొనకళ్ళ నారాయణ రావు, జిల్లా కలెక్టర్, సంయుక్త కలెక్టర్ పంచాంగ కర్తలను ఘనంగా సన్మానించారు. తదుపరి వారు గంటల పంచాంగాన్ని, శ్రీ వెంకటేశ్వర స్వామి కళ్యాణోత్సవం పత్రికను ఆవిష్కరించారు. అనంతరం ఆహుతులందరికీ ఉగాది పచ్చడి, చక్కెర పొంగలి, పులిహోర, దద్దోజనం, మజ్జిగ ప్రసాదాల పంపిణీ చేశారు. ఆగమ శాస్త్రంలో నిష్ణాతులైన అర్చక స్వాములు అగ్నిహోత్రం యుధిష్టిర కోదండపాణి, మురికిపూడి సత్యనారాయణ,రొంపిచర్ల విజయ సారథి కృష్ణమాచార్యులు, బిలాది మల్లికార్జున రావులను 10,116 రూపాయల నగదు పురస్కారం తోపాటు ప్రశంసా పత్రం జ్ఞాపిక శాలువలతో ఘనంగా సన్మానించారు. కవి సమ్మేళనం లో పాల్గొన్న కవులు డాక్టర్ ఏ ఆర్ కే మూర్తి,జొన్నలగడ్డ గణపతి శాస్త్రి, గుడిసేవ విష్ణు ప్రసాద్, పాణిగ్రాహి రాజశేఖర్, సింహాద్రి పద్మ, చెన్నాప్రగడ శర్మ, మేరీ కృప భాయి, వక్కలంక రామకృష్ణ, పల్లావజుల వెంకట శైలజ, భవిష్య, ఓలేటి ఉమా సరస్వతి, ముదిగొండ శాస్త్రిలను ఆర్టీసీ చైర్మన్, జిల్లా కలెక్టర్,సంయుక్త కలెక్టర్ ఘనంగా సన్మానించారు.

# పేదరికం లేని సమాజమే నా జీవితాశయం




(మొదటిపేజీ తరువాయి)

రాష్ట్ర ప్రజలను ఉద్దేశించి మాట్లాడారు.

**మన సంస్కృతి, సంప్రదాయాలు గొప్పవి :** భారతదేశ సంస్కృతి, సంప్రదాయాలు ఎంతో విశిష్టమైనవి. చరిత్రను మర్చిపోతే మనం ఉనికి కోల్పోతాం. ఉగాది అంటే మనకు గుర్తొచ్చేది పచ్చడి, పంచాంగ శ్రవణం. షడ్రుచుల మేళవింపు ఉగాది పచ్చడి. నాకు ఇంకా గుర్తుంది. చిన్న వయసులో రచ్చబండపై గ్రామస్తులంతా కూర్చుని ఉగాది శ్రవణం వినేవాళ్లం. మన సంప్రదాయాలు మరిచిపోకూడదనే ఉద్దేశంతో తెలుగు భాష, కళలకు ప్రాధాన్యత ఇచ్చే క్రమంలో ఆనాడు హైదరాబాద్‌లో హైటెక్ సిటీ పక్కన అవధాన కేంద్రం, అన్నమయ్య క్షేత్రం, శిల్ప కళా వేదిక ఏర్పాటు చేశాం. ఢిల్లీ ఏపీ భవన్, చెన్నై పొట్టి శ్రీరాములు మెమోరియల్ ట్రస్ట్‌లో ప్రభుత్వం తరపున ఉగాది వేడుకలు నిర్వహిస్తున్నాం.

**గత ప్రభుత్వ పాలనతో రాష్ట్రం కళ తప్పింది :** గత ప్రభుత్వ పాలనలో ఆ ఐదేళ్లు రాష్ట్రం కళ తప్పింది. అందరం కూర్చుని సంతోషంగా మాట్లాడుకునే పరిస్థితి లేదు. గడిచిన ప్రభుత్వం సృష్టించిన సమస్యలు నా సుదీర్ఘ రాజకీయ అనుభవంలో ఏనాడు చూడలేదు. అన్నీ చిక్కుముడులే. ఒక్కో చిక్కుముడిని విడదీస్తూ వ్యవస్థను సరిచేస్తున్నాం. ఈ ఏడాది రూ. 3.22 లక్షల కోట్ల బడ్జెట్ పెట్టాం. ప్రజల ఆదాయం పెరగాలి. తద్వారా జీవన ప్రమాణాలు పెరిగి అందరూ ఆరోగ్యంగా, ఆనందంగా ఉండాలి.

**పేదరిక లేని రాష్ట్రమే లక్ష్యం-అందుకే పీ4 :** సంపద కొందరికే పరిమితం కాకూడదు. ప్రతి ఒక్కరికీ మెరుగైన జీవన ప్రమాణాలు అందినప్పుడు సమసమాజ స్థాపన సాధ్యమవుతుంది. ఎన్టీఆర్, మహాత్మాగాంధీ, అంబేద్కర్ సహా ఎవరూ పుట్టుకతోనే గొప్పవారిగా పుట్టలేదు. వచ్చిన అవకాశాలను ఉపయోగించుకుని మహోన్నత వ్యక్తులుగా ఎదిగారు. నేడు ఉగాది పర్వదినాన మార్గదర్శి- బంగారు కుటుంబం జీరో పావర్టీ-పీ4కు శ్రీకారం చుట్టాను. సంపన్నులు పేదలను ఆదుకోవాలి. వారిని ఆర్థికంగా పైకి తేవాలి. అందరికీ విద్య, వైద్యం అందాలి. సమాజంలో ఉన్నత స్థానంలోని 10 శాతం మంది... సమాజంలో అట్టడుగున ఉన్న 20 శాతం పేద కుటుంబాలను ఆదుకుని వారి ఆర్థిక అభ్యున్నతికి స్వచ్ఛందంగా ముందుకువచ్చి సహకరించాలి. దాతృత్వంలో మన తెలుగువాళ్లు ప్రపంచానికే ఆదర్శం కావాలి.

**ఉగాది పురస్కారాలు :** నాగఫణి శర్మను 30 ఏళ్లుగా చూస్తున్నాను... అయితే ఆయనలో ఎలాంటి మార్పు రాలేదని ముఖ్యమంత్రి అన్నారు. వారి సేవలను గుర్తించి పద్మశ్రీ ఇవ్వడం మన తెలుగువారు అందరికీ గర్వకారణమని చెప్పారు. ఉగాది ఉత్సవాల సందర్భంగా వివిధ రంగాల్లో సేవలు అందించిన వారికి ముఖ్యమంత్రి చేతుల మీదుగా అవార్డుల ప్రదానం జరిగింది. 86 మందికి కళారత్న అవార్డులు, 116 మంది ఉగాది అవార్డులు అందుకున్నారు.

# పండుగలు మన సంస్కృతిలో భాగం

**సమాజ బాగు కోసం తపనపడే వ్యక్తి వెంకయ్యనాయుడు**

**ట్రస్ట్ నడపడం అంటే సాధారణ విషయం కాదు**

**విలువలు లేనివారితో పోరాడుతున్నందుకు ఆవేదనగా ఉంది**

**స్వర్ణభారత్ ట్రస్ట్ ఉగాది సంబరాల్లో ముఖ్యమంత్రి చంద్రబాబు నాయుడు**



**గన్నవరం (ఉంగుటూరు), మార్చి 30, మేజర్ న్యూస్ :** పండుగలు అనేవి మనదేశ సంస్కృతి, వారసత్వంలో భాగమని, ఏ దేశంలో లేని కళలు, సంప్రదాయాలు మన దేశంలోనే ఉన్నాయని ముఖ్యమంత్రి చంద్రబాబు నాయుడు అన్నారు. ఇతర దేశాల వారు కూడా మన సంప్రదాయాలు, సంస్కృతులను పాటిస్తున్నారంటే అది మన దేశ గొప్పతనమని అన్నారు. కృష్ణా జిల్లా ఆత్కూర్‌లోని స్వర్ణ భారత్ ట్రస్ట్ భవన్‌లో నిర్వహించిన ఉగాది సంబరాల్లో సీఎం చంద్రబాబు పాల్గొన్నారు. ఈ సందర్భంగా స్వర్ణ భారత్ ట్రస్ట్‌లో శిక్షణ పొందుతున్న విద్యార్థులు, మహిళలతో సీఎం కాసేపు ముచ్చటించారు. అనంతరం ప్రసంగించారు.

**సమాజం కోసం తపనపడే వ్యక్తి వెంకయ్య నాయుడు.**

తెలుగువారి తొలి పండుగ ఉగాది. ఈ ఉగాది నుంచే మన తెలుగు వారి పండుగలు ప్రారంభమవుతాయి. కలిసికట్టుగా సమస్యలను ఎదుర్కొనే కుటుంబ వ్యవస్థ మన దేశానికి ఉంది. వెంకయ్య నాయుడు రాష్ట్రం, దేశం, సమాజం గురించి తపనపడే వ్యక్తి. నేను, వెంకయ్య నాయుడు ఒకేసారి ఎమ్మెల్యేలు అయ్యాం. అసెంబ్లీలో వెంకయ్య నాయుడు మైకు తీసుకుంటే గజగజలాడేవారు. అంచలంచెలుగా ఎదిగారు. ఇద్దరం ఒకే పార్టీలో లేకపోయినా ప్రజాహితం కోసం ఆలోచించాం. ఎన్టీఆర్‌ను సీఎంగా తొలగించినప్పుడు నేను అండగా నిలబడతానని వచ్చి 30 రోజులపాటు పోరాడి మళ్లీ ఎన్టీఆర్ సీఎం అయ్యాక ఇంటికి వెళ్లారు. సిద్ధాంతాలకు కట్టుబడి పని చేశారు. బీజేపీ జాతీయ అధ్యక్షునిగా, కేంద్రమంత్రిగా, ఉపరాష్ట్రపతిగా పని చేశారు. వెంకయ్యనాయుడు తన పిల్లలకు జీవనోపాధికి మాత్రమే సాయం చేశారు. ప్రజల కోసం ఆయన సృష్టించిన ఆస్తులను చూసి అభినందిస్తున్నాను. విలువలు లేని వారితో పోరాడుతుంటే ఆవేదన కలుగుతోంది. రానురాను విలువలు పడిపోతున్నాయని వెంకయ్య నాయుడు అన్నారు. నాకు కూడా అదే అనిపిస్తోంది. ఎన్టీఆర్, జ్యోతిబసు, వాజపేయ్, సమాజంలో విలువలు గల వ్యక్తులతో నేను పని చేశా. కానీ నేడు రాష్ట్రంలో ఎవరితో పోటీ పడుతున్నానో చూసుకుంటే నిరాశ కలుగుతోంది. కానీ ప్రజల కోసం నిరంతరంగా పని చేయాలి... నేను చివరి శ్వాస వరకు ప్రజల కోసమే పని చేస్తా. ఒక ట్రస్ట్ నడపడం అంత తేలికైన వ్యవహారం కాదు. కానీ స్వర్ణ భారత్ ట్రస్ట్‌ను మహిళ అయిన దీపా వెంకట్ నడుపుతున్నారంటే అభినందించాలి. విద్యార్థులతో సమావేశమయ్యాను. ఎంట్రప్రెన్యూర్‌లు అవుతామని, ఉద్యోగాలు ఇస్తామని గ్రామాల్లోని యువత ఆలోచిస్తున్నారంటే ఇది స్వర్ణ భారత్ ట్రస్ట్ నింపిన స్ఫూర్తి. సంస్కృతి, సాంప్రదాయాలను భావి తరాలకు అందించే కార్యక్రమానికి శ్రీకారం చుట్టారు. నేను సీఎంగా ఉన్నప్పుడు ట్రస్ట్‌కు భూమి ఇవ్వండని కూడా వెంకయ్య నాయుడు అడగలేదు. ప్రభుత్వం నుంచి ఏమీ ఆశించకుండా అడగకుండా ట్రస్ట్ నడుపుతున్నారు. ఇక్కడ వివిధ విభాగాల్లో శిక్షణ తీసుకునేవారికి 90 శాతం ప్లేస్మెంట్ వస్తోంది. ప్రకృతి వ్యవసాయం, పాడి వంటి రంగాల్లో ఉత్తమ శిక్షణ ఇస్తున్నారు. 1991లో మన తెలుగువారైన పీవీ నరసింహారావు సంస్కరణలు తీసుకొచ్చి దేశ దశదిశ మార్చారు. ఎన్టీఆర్ సీఎం అయ్యాక ప్రభుత్వం అంటే పరిపాలనే కాదు సంక్షేమం, అభివృద్ధి కార్యక్రమాలు చేపట్టాలని సరికొత్త పాలనకు శ్రీకారం చుట్టారు. నేను ఐటీని దూరదృష్టితో ప్రమోట్ చేశాను. ఈ రోజు రెండింతల ఆదాయం మనవాళ్లు సంపాదిస్తున్నారు అని సీఎం చంద్రబాబు నాయుడు అన్నారు. రైతులకు అధిక ఆదాయం చేకూర్చే విధంగా నూతన ఆవిష్కరణలు రూపొందించే దిశగా ఆలోచించాలని జిల్లా కలెక్టర్ డీకే బాలాజీ శిక్షణ పొందిన యువ వ్యవసాయ పారిశ్రామికవేత్తలను కోరారు. ఉంగుటూరు మండలం లోని స్వర్ణభారత ట్రస్ట్ లో కేంద్ర ప్రభుత్వం సెంటర్ ఆఫ్ ఎంటర్ ప్రేనియర్ 45 రోజులపాటు డెవలప్మెంట్ (సీఈడీ), నోడల్ ట్రైనింగ్ ఇన్స్టిట్యూట్, మేనేజ్ సంయుక్త ఆధ్వర్యంలో అగ్రి క్లినిక్స్, అగ్రి బిజినెస్ సెంటర్స్ స్కీం కింద 45 రోజులపాటు వ్యవసాయ పారిశ్రామికవేత్తగా శిక్షణ పొందిన 28 మంది విద్యార్థులతో జిల్లా కలెక్టర్ సంయుక్త కలెక్టర్ గీతాంజలి శర్మతో కలిసి ట్రస్టులోని ముప్పవరపు ఫౌండేషన్- విజ్ఞాన వికాస కేంద్రం లో ఫోటో దిగారు. అనంతరం వారితో జిల్లా కలెక్టర్ మాట్లాడుతూ రైతు తన సొంత పొలంలో వరి పంట సాగు చేసుకుని ఎకరాకు 20 వేల రూపాయలు ఆదాయం సంపాదిస్తున్నారని, మినుము పంటతో కలిపి ఎంత కష్టపడి సాగు చేసిన ఎకరాకు 30 వేల రూపాయలు ఆదాయం వస్తుందన్నారు. అదే కనుక కౌలుకు చేసినట్లయితే ఇంకా తక్కువ ఆదాయం వస్తుందన్నారు. అందరూ గ్రామాలకు వెళ్లి క్షేత్ర పరిశీలన చేసి రైతులు ఎలా పంటలు పండిస్తున్నారు, వారికి ఏమి చేస్తే ఎక్కువ ఆదాయం పొందగలరో ఒకసారి ఆలోచించాలన్నారు. అగ్రికల్చర్ క్లినికులు ఏర్పాటుకు కేంద్ర ప్రభుత్వం సబ్సిడీ ఇస్తోందన్నారు. రాష్ట్ర ప్రభుత్వం నుండి కూడా అన్ని విధాల సహకారం అందిస్తామని రైతులకు భూసార పరీక్షల్లో గాని, పంటల సాగులో గాని, ప్రకృతి వ్యవసాయంలో గాని ఏమైనా సలహాలు సూచనలు ఇవ్వాలన్నారు.వ్యవసాయాన్ని ప్రస్తుతం ఆధునీకరణ పద్ధతుల్లో అమలుపరచుకుంటూ పనిముట్లని యాంత్రికరణం గా ఎక్కువ వినియోగించుకుంటూ తక్కువ సమయంలో అధిక దిగుబడితో పాటు వివిధ రకాల ఉత్పత్తులను తయారు చేయుటలో కూడా పరిశ్రమలలో నెలకొల్పుకొని యువత వ్యాపార రంగంలో అభివృద్ధి చెందాలన్నారు.మన భారతదేశం 80% వ్యవసాయ ఆధారిత ప్రాంతాలు కలిగి ఉంది. ఇతర దేశాలు మన దగ్గర పంటను కొనుగోలు చేసి ఆహార అనుబంధ ఉత్పత్తులు అంటే చిప్స్, పౌడర్లు, రెడీ టు ఈట్ ఫుడ్స్ ఇలా రకరకాల ఉత్పత్తుల తయారు చేసే వ్యాపార కేంద్రాలను నెలకొల్పుతున్నారన్నారు. ఈ కార్యక్రమంలో నోడల్ శిక్షణ కేంద్రం నోడల్ అధికారి పోలవరపు శోభారాణి, విద్యార్థులు పాల్గొన్నారు..

# ఉచిత వైద్యశిబిరానికి విశేష స్పందన





**మచిలీపట్నం మేజర్ న్యూస్ :** పర్ణశాల ప్రార్థనా మందిరము (ఘంటసాల)వారి ఆధ్వర్యంలో నిర్వహించిన కొంగనచర్ల గ్రామంలోని హెబ్రోన్ ప్రార్థనా మందిరం ఆవరణలో జరిగిన ఉచిత వైద్యశిబిరానికి విశేష స్పందన లభించింది. గుడ్ ఫ్రై డే, ఈస్ట్ పర్వదినాల సందర్భంగా ప్రజలకు ఉచిత ఆరోగ్య సేవలు అందించాలనే ఉద్దేశ్యంతో ఉచిత వైద్యశిబిరాన్ని నిర్వాహకులు ఏర్పాటు చేశారు. మచిలీపట్నంకు చెందిన వైద్యులు డాక్టర్ యనమండ్ర సాయి శశాంక్, యక్కటి ప్రవళికలు బీపీ, షుగర్, జల బు, దగ్గు, ఆస్తమా, మోకాళ్ల నొప్పులు, నడుము నొప్పి, దీర్ఘకాలిక వ్యాధులకు పరీక్షలు జరిపారు. సుమారు 151 మంది రోగులకు పర్ణశాల ప్రార్థనా మందిరం ఆధ్వర్యంలో రూ.30 వేల విలువైన మందులను ఉచితంగా అందజేశారు. ప్రార్థనా మందిరానికి సంబంధించిన విశ్వాసులు రోగులకు తమ సహాయ సహకారాలు అందించారు. అనారోగ్యవంతులు ఆరోగ్యంగా ఉండాలనే ఆలోచనతో ఈ వైద్యశిబిరాన్ని ఏర్పాటు చేసినట్లు నిర్వాహకులు తెలిపారు. తోటి వారికి సాయం అందించాలని ఏసుక్రీస్తు చెప్పిన మాటలను బట్టి ఈ ఉచిత వైద్య శిబిరం నిర్వహించామని తెలిపారు. ఈ కార్యక్రమంలో ఫాస్టర్ పిఎన్.రాజు, రమేష్, వెంకట రత్నం, కిరణ్, సుకన్య, ప్రదీప్, ప్రశాంత్, తరుణ్, ప్రవీణ్, సంఘ సభ్యులు, వైద్య సిబ్బంది తదితరులు పాల్గొన్నారు. వైద్యశిబిరానికి వచ్చిన రోగులకు ఎలాంటి ఇబ్బందులు కలుగకుండా తగు జాగ్రత్తలు తీసుకున్నారు. రోగులకు మజ్జిగ, మంచినీటిని అందజేయటంతోపాటు ప్రత్యేకంగా టెంట్లు ఏర్పాటు చేశారు.

## శ్రీ యోగానంద లక్ష్మీనరసింహస్వామి వారి ఆలయంలో తెలుగు నూతన సంవత్సర వేడుకలు



**జగ్గయ్యపేట మార్చి30 మేజర్ న్యూస్ :** పావన కృష్ణానది తీరమున పంచనా రసింహ క్షేత్రమైన, వేదాద్రి గ్రామములో వేంచేసియున్న శ్రీ యోగానంద లక్ష్మీ నరసింహ స్వామి వారి దేవస్థాములో దేవస్థాన వంశ పారంపర్య ధర్మకర్త డాక్టర్ వెలగపూడి లక్ష్మణఇందిరా దత్తు, కార్యనిర్వహణాధికారి కానూరి సురేష్ బాబు ఆధ్వర్యములో తెలుగు వారి విశ్వావసు నామ నూతన సంవత్సర ఉగాది పండుగ సందర్భంగా ఆదివారం భక్తుల సహకారముతో ఖమ్మం జిల్లా, చింతకాని మండలం, నేరేడ గ్రామ వాస్తవ్యులు మార్తా నాగయ్య అనువారు దేవస్థానముకు విచ్చేసిన భక్తులందరికీ అన్నదానం, శ్రీ స్వామి వారి నామ సంకీర్తన ఎకహ భజన కార్యక్రమము ఏర్పాటు చేసియున్నారు. అలాగే ఉగాది పండుగ సందర్భంగా రాత్రి గం. 7.00 లకు ఉగాది పంచాంగ శ్రవణం, సాంస్కృతిక కార్యక్రమములలో భాగంగా కోలాటం, స్వామి వారి-అమ్మవార్ల వేషధారణలో నృత్య ప్రదర్శనలు కలవని తెలియజేయడమైనది. కావున భక్తులు వేలాదిగా పాల్గొని స్వామివారి కృపకు పాత్రులు కాగలరని ఆలయ కార్యనిర్వాహణాధికారి కానూరి సురేష్ బాబు తెలిపారు.

## దైవజనులు ప్రవీణ్ పగడాల ఆత్మశాంతికి శాంతి ర్యాలీ




**పెడన, మేజర్ న్యూస్:** దైవజనులు ప్రవీణ్ పగడాల మృతిపై సమగ్ర విచారణ చేసి న్యాయం చేయాలని కోరుతూ వారి కుటుంబానికి ప్రగాఢ సానుభూతిని తెలియజేస్తూ శాంతి ర్యాలీని నిర్వహించామని నియోజకవర్గ దైవ సేవకుల సమాఖ్య సభ్యులు తెలిపారు. ఈ మేరకు పట్టణ మార్కెట్ యార్డ్ నుండి బస్టాండ్ సెంటర్ వరకు కొవ్వొత్తుల ర్యాలీని నిర్వహించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ విద్యావంతుడు, క్రిస్టియన్స్ స్కాలర్, జ్ఞానవంతుడు, ధైర్యశాలి, సత్యం కొరకు పోరాట యోధుడు, ప్రవీణ్ పగడాల మృతి తీరని లోటని అన్నారు. అతని మరణం పై ఉన్న అనుమానాలను నివృత్తి చేసి న్యాయం చేయాలని ప్రభుత్వాన్ని డిమాండ్ చేస్తున్నామన్నారు. ఈ కార్యక్రమంలో పెడన నియోజవర్గ దైవ సేవకుల సమైక్య సభ్యులు, క్రైస్తవ సమాజం, శాంతికాముకులు తదితరులు ఉన్నారు.

## ప్రపంచ స్థాయి ముగ్గుల పోటీలలో జగ్గయ్యపేట నారీకి రెండవ బహుమతి






**జగ్గయ్యపేట మేజర్ న్యూస్:** గత జనవరి సంక్రాంతి పండుగ సంబరాలు సందర్భంగా అమెరికాలో ఆంధ్రప్రదేశ్ అసోసియేషన్ ఆధ్వర్యంలో ప్రపంచస్థాయి ముగ్గుల పోటీలు నిర్వహించారు ఈ ముగ్గుల పోటీలలో ఎన్టీఆర్ జిల్లా జగ్గయ్యపేట పట్టణానికి చెందిన చెందిన మామిడి హర్షిత రెండవ బహుమతి 15 లక్షలు గెలుచుకున్నారు. ఈమె రాష్ట్ర, జిల్లా మండల స్థాయి పోటీల్లో అనేక బహుమతులు గెలుచుకోవడం జరిగింది. అనంతరం సంక్రాతి ఆన్లైన్ ముగ్గుల పోటిలకు ఉగాది కీ బహుమతులు అందజేశారు. ప్రపంచ దేశాలకు జగ్గయ్యపేట కీర్తిని చాటిచెప్పిన మామిడి హర్షిత కు ఈ ప్రాంత వాసులు అభినందనలు తెలిపారు.

## కూచిపూడి కళకు ఉగాది పురస్కారాలు



**మొవ్వ (మార్చి 30) మేజర్ న్యూస్:** ప్రతి ఏడాది ఉగాది పండుగ పర్వదినాన్ని పురస్కరించుకుని రాష్ట్ర ప్రభుత్వం వివిధ రంగాల్లో విశిష్ట సేవలు అందించిన వ్యక్తులకు ఉగాది పురస్కారాలు ప్రకటిస్తుంది. ఈ ఏడాది విశ్వవసు నామ సంవత్సరం ఆదివారం జరిగిన ఉగాది సంబరాల్లో కూచిపూడి నాట్య కళా రంగంలో విశిష్ట సేవలు అందించిన ఇద్దరు నాట్యాచార్యులు ఉగాది పురస్కారాలకు ఎంపికయ్యారు. అందులో భాగంగా కూచిపూడి సిద్ధేంద్ర కళా పీఠం వైస్ ప్రిన్సిపాల్ డాక్టర్ చింతా రవి బాలకృష్ణ రాష్ట్ర ముఖ్యమంత్రి నారా చంద్రబాబు నాయుడు చేతులు మీదుగా హంస అవార్డును అందుకున్నారు. అలాగే పసుమర్తి వెంకటేశ్వర శర్మ హంస అవార్డును అందుకున్నారు. ఈ సందర్భంగా అవార్డుకి ఎంపికైన నాట్యాచార్యులను గ్రామ సర్పంచ్ కొండవీటి వెంకటరమణ విజయలక్ష్మి, పలువురు గ్రామస్తులు, కళా పీఠం సిబ్బంది అభినందించారు.

## వెల్వడం పూర్వ విద్యార్థుల చలివేంద్రంలో మజ్జిగ, ఉగాది పచ్చడి పంపిణీ



**జి.కొండూరు మేజర్ న్యూస్ :** ఎన్టీఆర్ జిల్లా మైలవరం మండలం వెల్వడం లకిరెడ్డి పాపులమ్మ మెమోరియల్ జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలలో 1987-1992 సంవత్సరాలలో 6 నుండి 10 వతరగతి వరకు చదువుకొన్న పూర్వపు విద్యార్దుల సంఘం సహకారముతో వెల్వడం మెయిన్ సెంటర్‌లో నిర్వహిస్తున్న కూలింగ్ మంచి నీటి చలివేంద్రం వద్ద ఈ రోజు (ది 30-03-2025 ఆదివారం) తెలుగు నూతన సంవత్సరం ఉగాది పర్వదినాన్ని పురస్కరించుకొని ఉదయం 10గంటల నుండి సుమారు 1200 మంది కి పైగా మజ్జిగ పంపిణీ, ఉగాది పచ్చడి పంపిణీ చేయడం జరిగిందని విద్యార్థి సంఘం నాయకులు గూడూరు నాగి రెడ్డి తెలిపారు. భాణావతు ద్వాలి జ్ఞాపకార్ధం వారి కుమారుడు భాణావతు నరసయ్యసహకారంతోఈకార్యక్రమాన్నినిర్వహించాము. ఈ కార్యక్రమానికి ముఖ్య అతిధిగా తోట తిరుపతి రావు విచ్చేసి మజ్జిగ పంపిణీ ని, ఉగాది పచ్చడి ను పంపిణీ చేశారు. ఈ సందర్భంగా తిరుపతి రావు మాట్లాడుతూ పూర్వ విద్యార్థులందరూ కలసి ఎన్నో వ్యయప్రయాసలకోర్చి వేసవి కాలం లో రోజు చల్లటి మంచి నీటి చలివేంద్రం తో పాటు దాతల సహకారంతో మజ్జిగ పంపిణీ చేయడం చాలా అభినందనీయం అని, పూర్వ విద్యార్థులందరిని ఒక తాటిపైకి తీసుకొచ్చి ఇటువంటి మంచి కార్యక్రమాన్ని నిర్వహించడంలో గూడూరు నాగిరెడ్డి కృషి చాలా మెచ్చతగినదని కొనియాడారు. పాపులమ్మ హై స్కూల్ పూర్వ విద్యార్థులు ఇటువంటి మంచి కార్యక్రమాలు మరిన్ని చేయాలనీ కోరారు. పాపులమ్మ హై స్కూల్‌లో చదువుకున్న విద్యార్థులు అందరు కలసి ముందు ముందు మరిన్ని మంచి కార్యక్రమాలు నిర్వహిస్తామని, పూర్వపు విద్యార్థి సంఘం నాయకులు ఇండియన్ రెడ్ క్రాస్ సొసైటీ మైలవరం సబ్ బ్రాంచ్ సెక్రటరీ, ట్రెజరర్ గూడూరు నాగి రెడ్డి తెలియజేసారు. మజ్జిగ, ఉగాది పచ్చడి పంపిణీకి ఆర్థిక సహకారం అందించిన భాణావతు నరసయ్యని గూడూరు నాగి రెడ్డి అభినందించారు. సంఘం తరుపున అంబటికేశవ రావు, ఆనం వెంకటేశ్వర రావు, వేముల సూరయ్య, మాగిశెట్టి పుల్లారావు, పరికెల నాగేశ్వర రావు, కుదుముల హనిమిరెడ్డి తదితరులు హాజరైనారు.

## రోడ్డు ప్రమాదంలో ముగ్గురికి తీవ్ర గాయాలు





**పామర్రు మార్చి 30 మేజర్ న్యూస్:** రోడ్డు ప్రమాదంలో ముగ్గురు వ్యక్తులు తీవ్రంగా గాయపడిన సంఘటన పామర్రు పోలీస్ స్టేషన్ పరిధిలోని కనుమూరు గ్రామ సమీపంలో ఆదివారం జరిగింది. ఈ సంఘటనకు సంబంధించి పోలీసులు అందించిన వివరాల ప్రకారం హైదరాబాద్ నుండి మచిలీపట్నం వస్తున్న కారు ముందు వెళ్తున్న రెండు మోటార్ సైకిళ్లను ఢీకొనడంతో వాటిపై ప్రయాణిస్తున్న ముగ్గురు వ్యక్తులు తీవ్రంగా గాయపడ్డారు. పమిడిముక్కల మండలం వేల్పూరు గ్రామానికి చెందిన రత్నం సుధాకర్ (17) మరో వ్యక్తితో కలిసి మోటార్ సైకిల్ పై వెళ్తుండగా వెనుక నుండి వస్తున్న కారు ఢీకొంది. ఈ ప్రమాదంలో సుధాకర్ తలకు తీవ్ర గాయమైంది. రెండవ వ్యక్తికి కాలు విరిగింది. అలాగే కారు మరో మోటార్ సైకిల్ కూడా మీకు ఉండడంతో దానిపై ప్రయాణిస్తున్న వ్యక్తి కూడా కాలు విరిగింది. తలకు తీవ్ర గాయం కావడంతో సుధాకర్ ను హుటాహుటిన విజయవాడ ప్రభుత్వాసుపత్రికి తరలించారు. కాళ్లు విరిగిన ఇద్దరు బాధితులను మచిలీపట్నం ప్రభుత్వాసుపత్రికి తరలించారు. ఈ ప్రమాదంపై కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు ఎస్సై వి.రాజేంద్రప్రసాద్ తెలిపారు.

## డాక్టర్ నాగరాజు మాస్టారుకు ఉగాది పురస్కారం



**జి.కొండూరు మేజర్ న్యూస్ :** తెలుగు సంవత్సరాది ఉగాది పండుగ పురస్కరించుకొని భారతీయ జనతా పార్టీ ఆంధ్ర ప్రదేశ్ రాష్ట్ర కార్యాలయంలో ఆదివారం ఉగాది పంచాంగ శ్రవణం వివిధ రంగాల వారికి ఉగాది పురస్కారాలు అందించారు ఎన్టీఆర్ జిల్లా జి కొండూరుకు చెందిన తెలుగు పండితులు ఆంధ్ర రత్న అవార్డు గ్రహీత, వక్త,తెలుగు భాషా సేవకులు డాక్టర్ పెదగమళ్ళ నాగరాజు మాస్టారును విద్యారంగం నుండి తెలుగు భాషకు చేస్తున్న సేవకుగాను ఉగాది పురస్కారాన్ని కేంద్ర మాజీ మంత్రివర్యులు ప్రస్తుత శాసనసభ్యులు సుజన చౌదరి రాష్ట్ర నాయకులు మధుకర్ యామిని శర్మ,శ్రీరామ్,కొల్లి నాగేశ్వరరావు తదితరుల చేతుల మీదుగా అందుకున్నారు ఈ సందర్భంగా నాగరాజు మాస్టర్ మాట్లాడుతూ రాష్ట్రవ్యాప్తంగా వివిధ రంగాలలో నలుగురికి అందించగా విద్యారంగంలో ఒకడిగా ఈ పురస్కారం అందుకోవటం చాలా సంతోషంగా ఉందని అన్నారు ఈ పురస్కారంతో తనపై మరింత బాధ్యత పెరిగిందన్నారు.

## ఉగాది సందర్భంగా వయోవృద్ధులకు పూజారులకు పారిశుధ్య కార్మికులకు వస్త్రాల బహూకరణ



**జి.కొండూరు మేజర్ న్యూస్ :** వెలగలేరు గ్రామంలో విశ్వావసు నామ సంవ త్సర ఉగాది సందర్భంగా కీర్తిశేషులు చనమోలు పెత్తందారు పకీరయ్య- వెంకటజలమ్మ జ్ఞాపకార్థం కుటుంబ సభ్యులు, వారి సన్నిహితులు యలమంచిలి విజయ్ కుమార్(పండు), పలగాని రాము జ్ఞాపకార్థం కుమారుడు కోటి రత్నం, వివేకానంద యువజన సమాఖ్య సహకారంతో వెలగలేరు గ్రామంలోని శివాలయం సాయిబాబా సన్నిధిలో గ్రామానికి చెందిన 100 మంది వయోవృద్ధులకు, గ్రామంలోని వివిధ దేవాలయాల పూజారులకు, గ్రామపంచాయతీ పారిశుధ్య సిబ్బందికి వస్త్ర దానం చేశారు. మహిళలకు చీరా-జాకెట్, పురుషులకు షర్టు-పంచె వితరణ గావించారు. కార్మిక, ఉపాధి శాఖ రిటైర్డ్ అసిస్టెంట్ డైరెక్టర్ వి టి తోడరమల్- టా న్య దంపతుల చేతుల మీదుగా ఈ వస్త్రాలను వయోవృద్ధులకు అందజేసినారు. అనంతరం నూతన తెలుగు సంవత్సరం సందర్భంగా ప్రత్యేకంగా అలంక రించిన సాయిబాబా వారి విగ్రహంనకు కుటుంబ సభ్యులు ప్రత్యేక పూజలు నిర్వహించి అందరికీ తీర్థ ప్రసాదాలు అందజేశారు. సాయిబాబా సన్నిధిలో వరుసగా 16వ సంవత్సరం తమ కుటుంబ సభ్యులచే వస్త్రధాన కార్యక్రమం చేసినట్లు తెలియజేశారు. ఈ కార్యక్రమంలో పకీరయ్య కుమారు డు - కోడలు చనమోలు నరసింహస్వామి -పద్మావతి, చనమోలు కృష్ణారావు(స్వా మి),మనుమలు, మనుమరాల్లు శ్రీనివాస్, రాము, సుధారా ణి.. ముది మనుమళ్లు అనుమోలు మురళి, రేణుక,రేవంత్, పార్దు, మాదల నాని, గ్రామస్తులు వివేకానంద యువజన సమాఖ్య సభ్యులు పాల్గొన్నారు.



## కలెక్టరేట్‌లో ఘనంగా ఉగాది వేడుకలు

**విజయవాడ, మేజర్ న్యూస్ :** ఎన్‌టీఆర్ జిల్లా దేవాదాయ, ధర్మాదాయ శాఖ ఆధ్వర్యంలో ఆదివారం కలెక్టర్ కార్యాలయంలో శ్రీ విశ్వావసు నామ సంవత్సర ఉగాది వేడుకలు ఘనంగా జరిగాయి. శ్రీ వెంకట రంగసాయి కుమార్ శర్మ పంచాగ శ్రవణం చేశారు. రాశి ఫలాలు వివరించారు. కొత్త తెలుగు సంవత్సరంలో ప్రతిఒక్కరి జీవితంలో ఆనందం, ఆరోగ్యం, సిరి సంపదలతో కొత్త వెలుగులు నిండాలంటూ వేద పండితులు ఆశీర్వచనాలు అందించారు. వేడుకల్లో పాల్గొన్న డీఆర్‌వో ఎం.లక్ష్మీనరసింహం మాట్లాడుతూ శ్రీ విశ్వావసు నామ సంవత్సరంలో కలెక్టర్ డా. జి.లక్ష్మీశ సారథ్యంలో జిల్లా అన్ని రంగాల్లోనూ సమగ్రాభివృద్ధి చెందాలని, సమృద్ధిగా వర్షాలు కురిసి రైతుల కుటుంబాల్లో ఆనందం వెల్లివిరియాలని.. ప్రజలందరూ ఆనందంగా ఉండాలని కోరుకుంటున్నట్లు పేర్కొన్నారు. వేడుకల్లో భాగంగా వేద పండితులు వెంకట రంగసాయి కుమార్ శర్మతో పాటు దాములూరి అప్పయ్యశర్మ (శ్రీ రామలింగేశ్వర స్వామి దేవాలయం, పెండ్యాల), వేదాంతం అజయ్‌కుమార్ (శ్రీ సీతారామస్వామి దేవస్థానం, చందర్లపాడు), తూములూరి కృష్ణమూర్తి (శ్రీ ఆంజనేయ స్వామి దేవస్థానం, మునగచర్ల), దుర్భాకుల సాంబమూర్తి అవధాని (శ్రీ చెన్నకేశవ స్వామి దేవస్థానం, నందిగామ)లను సత్కరించారు.

## అడ్డాడలో చలివేంద్రం ఏర్పాటు



**పామర్రు మార్చి 30 మేజర్ న్యూస్:** పామర్రు మండలం అడ్డాడ గ్రామంలో ప్రధాన రహదారి పక్కన తెలుగు దేశం పార్టీ ఆధ్వర్యంలో ఆదివారం చలివేంద్రాన్ని ఏర్పాటు చేశారు. ఈ సందర్భంగా తొలి రోజు కావడంతో తెలుగుదేశం పార్టీ నాయకులు మజ్జిగను పంపిణీ చేశారు. ఎండాకాలం పూర్తయ్యే వరకు ప్రతిరోజు చల్లటి తాగునీరు ఏర్పాటు చేస్తున్నామని ఈ సందర్భంగా నిర్వాహకులు తెలిపారు. వేసవి కాలంలో ఈ రోడ్డుపై ప్రయాణించే వారి దాహార్తి తీర్చేందుకుగాను సేవా దృక్పథంతో ఈ సౌకర్యం ఏర్పాటు చేస్తున్నామని వారు తెలిపారు. ఈ కార్యక్రమంలో తెలుగుదేశం పార్టీకి చెందిన స్థానిక నాయకులు, పెద్ద సంఖ్యలో కార్యకర్తలు పాల్గొన్నారు.

## స్వంత నిధులతో బోర్ పంపు ఏర్పాటు



**పమిడిముక్కల మార్చి 30 మేజర్ న్యూస్:** పెనుమెత్స గ్రామంలోని దళిత వాడలో (ఎన్టీఆర్ కాలనీ) ప్రజల తాగునీటి అవసరాల కోసం గ్రామస్తురాలు దండమూడి రాధామణి తన స్వంత నిధులతో బోరు పంపును ఏర్పాటు చేశారు.ఆమె తన మామ అయిన దండమూడి సుబ్బారావు (సోబన్న) జ్ఞాపకార్థం 90 వేల రూపాయలతో డబ్బా పంపును ఏర్పాటు చేయించారు. ఆ పంపును ఆదివారం ఆమె గ్రామస్తులతో కలిసి ప్రారంభించారు. తమ త్రాగునీటి అవసరాన్ని తెలియజేసిన వెంటనే స్పందించి డబ్బా పంపును ఏర్పాటు చేసిన రాధామణి ని దళితవాడ ప్రజలు ఘనంగా సత్కరించి కృతజ్ఞతలు తెలియజేశారు. ఆమె దాతృత్వంతో వేసవిలో తమకు తాగునీటి కష్టాలు తీరాయని ఆ దళితవాసులు ఆనందం వ్యక్తం చేస్తున్నారు. ఈ కార్యక్రమంలో గ్రామ ప్రముఖులు మొవ్వ రాము, చింతమనేని రాంబాబు తదితరులు పాల్గొన్నారు.

## మజ్జిగ మంచినీళ్లు పంపిణీ



**మొవ్వ (మార్చి 30) మేజర్ న్యూస్:** మానవతా స్వచ్ఛంద సేవా సంస్థ కూచిపూడి వారి ఆధ్వర్యంలో ఆదివారం కూచిపూడి బస్టాండ్ లో వేసవి దప్పిక తీర్చేందుకు గాను మజ్జిగ, మంచినీళ్లు ఉచితంగా పంపిణీ చేశారు. కూచిపూడి గ్రామ సర్పంచ్ కొండవీటి వెంకటరమణ విజయలక్ష్మి, కూచిపూడి ఎస్సై కే నాగ విశ్వనాథ్ లు మజ్జిగ, మంచినీళ్లు శిబిరాన్ని ప్రారంభించారు. ఈ కార్యక్రమంలో మానవతా స్వచ్ఛంద సేవా సంస్థ ప్రతినిధులు పిట్టు శ్రీనివాసరావు పాగోలు రమేష్ బాబు, డాక్టర్ విష్ణు, మంత్రయ్య, కటకం పూర్ణచంద్రరావు, శివ, కొండవీటి అమర బాలేశ్వరరావు పలువురు సంస్థ ప్రతినిధులు పాల్గొన్నారు.

# శ్రీ కొండలమ్మ సన్నిధిలో ఉగాది పంచాంగ శ్రవణం





**గుడ్లవల్లేరు మేజర్ న్యూస్ :** కృష్ణాజిల్లా, గుడ్లవల్లేరు మండలం, వేమవరం గ్రామంలో వేంచేసియున్న శ్రీ కొండలమ్మ అమ్మవారి దేవస్థానంలో ఈరోజు ఆదివారం, ఉగాది నూతన తెలుగు సంవత్సరాది కూడా అగుట వలన భక్తులు అత్యధిక సంఖ్యలో శ్రీ అమ్మవారిని దర్శించుకొని శ్రీ అమ్మవారికి పాల పొంగళ్ళు సమర్పించి, మ్రొక్కుబడులు సమర్పించుకొన్నారు. ఈరోజు ఉదయం విశ్వావసు నామ సంవత్సరము ఉగాది సందర్భంగా మూలవర్లు అమ్మవారికి స్నపన అభిషేకం చేశారు. అర్చకులు శివ సంతోష్ ఆధ్వర్యంలో అభిషేకం జరిగింది. ఈ అభిషేకమును ఈవో ఆకుల కొండలరావు పర్యవేక్షించారు. పండితులు, బంటుమిల్లి వాస్తవ్యులు జెపివిఎన్. శర్మ పంచాంగ శ్రవణం చేయగా శ్రీ అమ్మవారి దేవస్థానము మాజీ ట్రస్ట్ బోర్డ్ చైర్మన్లు, మెంబర్లు కూటమి నాయకులు, భక్తులు ఈ కార్యక్రమములో పాల్గొన్నారు. భక్తులకు ప్రసాద వితరణ జరిగినది. రెండు దేవాలయములకు, మండపమునకు, క్యూలైన్ మండపములకు, పాల పొంగలిశాలకు విశేష పూల అలంకరణ చేశారు. ఈరోజు భక్తుల రద్దీ దృష్ట్యా త్రాగు నీరు వగైరా సదుపాయములు ఏర్పాటు చేశారు. దేవస్థానం ప్రాంగణములో శానిటేషన్ ఏర్పాట్లును ఈవో ఆకుల కొండలరావు పర్యవేక్షించారు.

శ్రీ కొండలమ్మ అమ్మవారి దర్శనమునకు విచ్చేసిన భక్తులకు ఏ విధమైన అసౌకర్యములు, అవాంఛనీయ సంఘటనలు కలగకుండా గుడ్లవల్లేరుఎస్ఐ సత్యనారాయణ, వారి సిబ్బంది తగు బందోబస్తు ఏర్పాట్లు చేశారు. ఈరోజు షుమారు 20,000 మంది భక్తులు శ్రీ కొండలమ్మ అమ్మవారిని ధర్శించుకొనినట్లుగా ఆలయ కార్యనిర్వహణాధికారి ఆకుల కొండల రావు ఒక ప్రకటనలో తెలియజేశారు.

# కౌన్సిల్ సమావేశంలో ప్రజావసరాలు మరిచి వ్యక్తిగత దూషణలు



**పెడన,మేజర్ న్యూస్ :** పురపాలక సంఘ కౌన్సిల్ సమావేశంలో ప్రజా అవసరాలను మరిచి వ్యక్తిగత కక్షతో తమ నాయకుడు బొడ్డు వేణుగోపాల రావు పై అసత్య దూషణలకు వైసీపీ కౌన్సిలర్లు దిగుతున్నారని పట్టణ టిడిపి అధ్యక్షుడు యక్కల శ్యామలరావు వైసీపీ కౌన్సిలర్ల పై ఆగ్రహం వ్యక్తం చేశారు. ఈ మేరకు పట్టణంలో అనుముల పూర్ణ ఇంటి వద్ద పాత్రికేయుల సమావేశం ఏర్పాటు చేశారు. ఈ సందర్భంగా శ్యామల రావు మాట్లాడుతూ మాజీ మున్సిపల్ చైర్ పర్సన్ బొడ్డు వేణుగోపాలరావు పై వైసీపీ కౌన్సిలర్లు కౌన్సిల్ సమావేశంలో అసత్య ఆరోపణలు చేస్తున్నారని, భూకబ్జా నిజమే అయితే ఇప్పటివరకు ఆయనకు నోటీసులు ఎందుకు అందజేయలేదని అన్నారు. విజిలెన్స్ ఎంక్వయిరీలో కేవలం ఇద్దరు వ్యక్తుల పేర్లు మాత్రమే వచ్చాయని అటువంటిప్పుడు 8 మంది ఎక్కడ నుంచి వచ్చారని చెబుతూ, భూకబ్జా బొడ్డుపై రుద్దటం ఇది రాజకీయ కక్ష అని తెలిపారు. ఆ ఎంక్వయిరీ తర్వాత రెవెన్యూ అధికారులు ఆ భూమిని పురపాలక సంఘానికి అప్ప చెప్పారని చెప్పారు. భూమి కి సంబంధించిన డాక్యుమెంట్లో 1.65 సెంట్లు ఉండగా కేవలం 1.34 సెంట్లు తో మాత్రమే అగ్రిమెంట్ జరిగిందని డాక్యుమెంట్ ప్రకారం మిగిలిన భూమి తమకు అప్పచెప్పాలని పేర్కొన్నారు. అంతేగాక ఆ భూమిని అంతకుముందు ఇద్దరు వ్యక్తులు దగ్గర నుండి డాక్యుమెంట్ రూపంలో వచ్చింది తప్ప కబ్జాది కాదని ఘంటాపరంగా పేర్కొన్నారు. గత నాలుగు సంవత్సరాలగా కౌన్సిల్ సమావేశాల్లో రాని ఈ అంశాన్ని ఇప్పుడు ఎందుకు తీసుకువచ్చారని ప్రశ్నించారు. రాష్ట్రస్థాయిలో తమ నాయకుడికి నామినేట్ పోస్టు వస్తుందని, ఈ వైసీపీ కౌన్సిలర్లు ఓరవలేక ఇటువంటి ఆరోపణలు చేస్తున్నారని చెప్పారు. ఈ కార్యక్రమంలో కౌన్సిల్ సభ్యురాలు బల్ల పద్మావతి సూర్యచంద్రరావు, ఎర్ర రాజా, వాహబ్ ఖాన్, కమ్మగంటి బాబు, పరసాజితేంద్ర, అజయ్, టిడిపి నాయకులు, కార్యకర్తలు ఉన్నారు.

# బ్రాహ్మణ సేవా సంఘం ఆధ్వర్యంలో ఘనంగా ఉగాది వేడుకలు



**మచిలీపట్నం మేజర్ న్యూస్ :** శ్రీ విశ్వావసు నామ సంవత్సర ఉగాది సందర్భంగా గొడుగు పేట శంకరమఠంలో ఆదివారం బ్రాహ్మణ సేవా సంఘం సమావేశం నిర్వహించి, విశ్వావసు నామ సంవత్సర పంచాంగ ము 2025,2026 సంవత్సరానికి గాను పంచాంగములను బ్రాహ్మణ సేవా సంఘం ఆధ్వర్యంలో ఆవిష్కరించి పంపిణీ చేసి, బ్రహ్మశ్రీ విష్ణుభట్ల సూర్యనారాయణ శర్మ ఘనాపాటి వారిచే పంచాంగ శ్రవణం నిర్వహించి, పలువురు బ్రాహ్మణ ప్రముఖులకు బ్రాహ్మణ సేవా సంఘం ఆధ్వర్యంలో వారు చేస్తున్న విశేష సేవలను గుర్తించి బ్రాహ్మణ ప్రముఖులైన, బ్రహ్మశ్రీ విష్ణుభట్ల సూర్యనారాయణ శర్మ ఘనాపాటి, వేమూరి రామకృష్ణారావు, డాక్టర్ బృందావనం ధన్వంతరి ఆచార్య, ఏ ఆర్ కె మూర్తి, జె. మల్లికార్జున ప్రసాద్, జమ్మలమడక సేతురామయ్య, సింగరాజు గోవర్ధన్‌లను బ్రాహ్మణ సేవా సంఘం ఆధ్వర్యంలో ఘనంగా సత్కరించారు. ఈ సందర్భంగా జరిగిన కార్యక్రమాన్ని ఉద్దేశించి బ్రాహ్మణ సేవా సంఘం సీనియర్ నాయకుడు, డాక్టర్ బృందావనం ధన్వంతరి ఆచార్య మాట్లాడుతూ బ్రాహ్మణులు ఐక్యతతో ముందుకు వెళ్ళినప్పుడు హక్కులు సాధించుకోవచ్చు అన్నారు. బ్రాహ్మణులు సమాజ సేవలో ముందుంటూ రాబోయే భావితరాలను ప్రోత్సహిస్తూ ముందుకు సాగాలి అన్నారు. ఉగాది పండుగ తెలుగు సంవత్సరానికి సంబంధించిన ముఖ్యమైన పండుగ అన్నారు. ఉగాది పండుగ ఒక కొత్త ప్రారంభం కాబట్టి ఆశలు, ఆశయాల నిర్వహణకు ప్రతీక అన్నారు. ఉగాది పచ్చడి జీవితం యొక్క అన్ని మధురాలను, కఠినతనాన్ని,శోభను ప్రతిబింబిస్తుంది. ఉగాది పచ్చడిని ఆహారంగా తీసుకోవడం ద్వారా ప్రతి ఒక్కరి జీవితం ఆనందంగా, విజయవంతంగా ఉంటుందని అన్నారు.ఉగాది రోజున చేసే పంచాంగ శ్రవణం ఎంతో ముఖ్యమైనది అన్నారు. ఉగాది పండుగ అనేది ప్రజలలో నూతన ఆశలు, కొత్త సంకల్పాలను ప్రతిబింబించే పండుగ అన్నారు. ఉగాది పండుగ కుటుంబం, సమాజం,, ప్రకృతికి సంబంధించిన అనుబంధాలను పునరుద్ధరించే పండుగ అన్నారు. బ్రాహ్మణులు హిందూ ధర్మ పరిరక్షణ లో భాగంగా అన్ని వర్గాలను కలుపుకుంటూ ఐక్యతతో ముందుకు సాగాలి అని పిలుపునిచ్చారు.ఈ కార్యక్రమంలో బ్రాహ్మణ సేవా సంఘం నాయకులు, వింజమూరి శివరాం, మోపర్తి సుబ్రమణ్యం, వడ్లమన్నాటి మారుతీ దివాకర్, పి. వి. ఫణి కుమార్, కాళీపట్నపు రఘు, అంబటి పూడి సుబ్రమణ్యం, డివి రమణ రావు, చోడవరపు లక్ష్మీ ప్రసున్న, గురజాడ రాజేశ్వరి తదితరులు పాల్గొన్నారు.

# నేడు రంజాన్ పండుగ శుభాకాంక్షలు



**రంజాన్ మాసం యొక్క సామాజిక ప్రాముఖ్యత**

**ఇరుగుపొరుగు సంతోషాన్ని పంచుకోవడమే అసలు పండుగ**

**ఆర్థిక స్తోమత ఉన్నవారు కచ్చితంగా జకాత్ చెల్లించాలి**

**దానం వలన మీ సంపద ఏమాత్రం తగ్గిపోదు**



**నందిగామ, జనవరి 30, మేజర్ న్యూస్:** ఉపవాసం అంటే కేవలం ఆహార పానీయాలను మానివేయడం మాత్రమే కాదు. దీక్ష లక్ష్యం మనిషిలో దైవభీతి, దేవుడు పట్ల నమ్మకం, పేదవాడి ఆకలి నిజమే తెలియడమే నిజమైన ఉపవాసం.ఇస్లాంలో రోజా లేదా ఉపవాసం అనేది ప్రతి సంవత్సరం ఒక చాంద్రమాన నెల(రంజాన్) వ్యవధిలో జరిగే విస్తృతమైన ప్రక్రియ. రోజా లేదా ఉపవాసం ఉన్న వ్యక్తి సూర్యోదయం నుండి సూర్యాస్తమయం వరకు వ్యక్తి తినడు, త్రాగడు లేదా పొగ త్రాగడు. రంజాన్ నెలలో ఒక వ్యక్తి తినడం, త్రాగడం నుండి సంయమనం పాటించడమే కాకుండా సానుకూల భావాలను పెంపొందించడానికి ఉత్కృష్టమైన మానసిక స్థితికి కూడా వస్తాడు. దీనిని సాధించడానికి, ఇతరుల గురించి చెడుగా వినడం, మాట్లాడటం, లేదా ప్రతికూలంగా ఆలోచించడం నుండి తనను తాను నిగ్రహించుకోవాలి.దివ్య ఖురాన్ అవతరించిన నెలగా రంజాన్ నెల పరిగణించబడుతుంది. ప్రవక్త ముహమ్మద్ (స) రంజాన్ మాసంలో మొదటి ద్యోతకం పొందారు.దివ్య ఖురాన్ ఇలా చెబుతోంది:"ఓ విశ్వాసులారా! మీ పూర్వీకులపై ఉపవాసం విధించబడినట్లే మీ పై కూడా విధింపబడినది –తద్వారా మీలో భయభక్తులు జనించే అవకాశం ఉంది.ఉపవాసం, స్వీయ-శుద్ధి యొక్క విస్తృతమైన ప్రక్రియ కూడా. ఒక నెల వ్యవధిలో ఈ స్వీయ-శుద్ధీకరణ ప్రక్రియను పాటిస్తే దాని ప్రభావం మిగిలిన 11 నెలల వరకు ఉంటుంది, ఆ తర్వాత ఈ ప్రక్రియ పునరావృతమవుతుంది.

**సామాజిక ప్రాముఖ్యత:** సామాజిక శాస్త్రపరంగా చూస్తే, ఉపవాసం అనేది పేదలపట్ల సంఘీభావాన్ని తెలియజేస్తుంది. దాతృత్వం, పరిసరాలు, ఆతిథ్యం అనే భావనను వ్యక్తపరుస్తుంది. ఉపవాసం శరీరం, ఆత్మను శుద్ధి చేయడంలోపాటు మానవులను ఆదర్శ మానవులుగా మారుస్తుంది.

**దాతృత్వం:** దాతృత్వంలో పేదలకు సహాయం చేయడం కూడా ఉంటుంది. ఈ మాసంలో చిన్నమొత్తమైనా దానం చేస్తే 70 రెట్లు ఎక్కువ పుణ్యఫలం లభిస్తుందని చెబుతారు. ఒక ముస్లిం తన వ్యక్తిగత సంపదను నగదు, వస్తువులు రెండింటినీ లెక్కించి, పేదలు మధ్య పంపిణీకి 2.5% ఏ 'జకాత్'గా తీయాలని ఆదేశం. ప్రతిఫలంగా దేవుడు తన సంపద, ఆస్తిని కాపాడతాడని ముస్లిములు భావిస్తున్నారు. జకాత్ సామాజిక న్యాయం తీసుకురావడానికి ఎంత అద్భుతమైన పథకం. ధనవంతులు దీనిని పూర్తి చిత్తశుద్ధితో ఆచరిస్తే, నిరుపేదలకు ఆర్థిక సహాయం లభిస్తుంది.

**పొరుగు భావన:** ఇస్లాం లో పొరుగు భావన చాలా ముఖ్యమైనది. ఇది విస్తృత అర్థాలను కలిగి ఉంది. ప్రవక్త(స) ఇలా అన్నారు, "ఒకరు మొత్తం మానవాళితో మర్యాదగా ప్రవర్తించాలి, వారిలో ప్రధానమైనది మీ పొరుగువారు." నిజమైన ముస్లిం ఏ మానవుని ఆకలితో చూడలేడు, అంటే 'ఇఫ్తార్' త్యాగం చేయవలసి వచ్చినప్పటికీ, మరుసటి రోజు ఆహారం తీసుకోకుండా ఉపవాసం కొనసాగించడం. నిజమైన ముస్లిం మానవుడిని బాధలో చూడలేడు. ఇస్లాం ముఖ్యంగా 'రోజా' ఒక వ్యక్తికి మానవ ఆందోళనలు, విలువలను పరిష్కరించడం బోధిస్తుంది.

**ఆతిథ్య భావన:** ఆతిథ్యం గురించిన ప్రవక్త ఇలా అన్నారు: "అతిథి పాదాల చప్పుడు విని సంతోషించే వారి పాపాలను దేవుడు క్షమిస్తాడు". ముస్లింలు దేవుని నుండి క్షమాపణ పొందేందుకు మంచి విషయాలను ఆచరించడానికి ప్రయత్నిస్తారు కాబట్టి, దానిని సాధించడానికి ఉపవాసం కంటే మెరుగైన ప్రేరణ మరొకటి ఉండదు.

**నిజం మాట్లాడే అలవాటును అలవర్చుకోవడం:** రంజాన్ ఉపవాసం యొక్క గొప్ప ప్రయోజనాల్లో ఒకటి ఏమిటంటే, ఉపవాసం ఒక వ్యక్తిలో నిజం మాట్లాడే అలవాటును పెంచుతుందని భావిస్తున్నారు. భగవంతుని సృష్టిలో నీతిమంతుల మార్గము సత్యమార్గమని అంగీకరించబడింది." ప్రవక్త (స) ఇలా అన్నారు: "వాస్తవమే చెప్పండి, అది ప్రజలకు చేదుగా లేదా అసహ్యంగా ఉండవచ్చు.నిజాయితీ ప్రతి ముస్లిం యొక్క ముఖ్యమైన లక్షణం. ఒక వ్యక్తి ఉపావాసం ఉండి నిజం మాట్లాడి, ఆతిథ్యం, పొరుగువారి భావనను ఆచరించి, దానధర్మాలు చేస్తే, అతను/ఆమె ఆదర్శ మానవుడు (ఇన్సాన్) మాత్రమే కాదు, దేవుని ఆశీర్వాదాలు, రక్షణ కు అర్హులు అవుతారు. చివరికి ఖురాన్ సారాంశం చెడుకు దూరంగా ఉండే మంచిని నెలకొల్పి నీకు ఉన్న దానిలో పేదవారికి సహాయం చేయడమే నిజమైన రంజాన్ పండుగ. రంజాన్ అనేది కేవలం పన్నెండు నెలల్లో ఒక నెల పేరు మాత్రమే. వాస్తవానికి రంజాన్ నెల మొత్తం ఉపవాసాలు ఉండి, షవ్వాల్ నెల మొదటి రోజు పండుగ చేసుకోటాన్ని బట్టి "రంజాన్ పండుగ" అని సర్వసాధారణంగా పిలుస్తుంటారు. తప్పితే ఈ పండుగ అసలు పేరు "ఈదుల్ ఫితర్" అంటే– "దానాల పండుగ" అని అర్థం.దానాల పండుగ" – ఈ పదం వినటానికే ఆశ్చర్యంగా ఉంది ఒక రకంగా ఈ "ఈదుల్ ఫితర్" పండుగ రోజును సామాన్య పరిభాషలో "ఛారిటీ డే అని చెప్పాల్సి ఉంటుంది.దానాలను చెయ్యటాన్ని కూడా పండుగలా సెలబ్రేట్ చేసుకునే ఒక రోజుంటుందా? అన్నది ఆలోచిస్తేనే ఆశ్చర్యం కలుగుతుంది. కానీ ఇస్లాం, ముస్లిం సమాజానికి మీ కుటుంబంలో, ఇరుగు పొరుగున ఉండే బీదలను కలుపుకుని వారికి దానమిచ్చి పండుగ చేసుకునే విధానం నిర్దేశిస్తుంది. తమ ఆత్మ గౌరవం కొద్దీ కొందరు నోరు తెరచి ఆర్థిక స్తోమత గురించి తమ అవసరాల గురించి చెప్పలేరు. అలాంటి వారిని సైతం కనిపెట్టి దానం చెయ్యమని ఇస్లాం చెబుతుంది.అటు భయభక్తులు, నైతిక విలువలతో పాటు ఇటు బీదసాదల, అవసరార్థుల, అన్నార్తుల హక్కును పటిష్టంగా నెరవేర్చటానికి, దానం విధిగా చెయ్యటాన్ని ఆచరణాత్మకం గా నేర్పటానికి నిర్దేశించబడిన నెలే "రంజాన్". ఈ నెలంతా ఉపవాసాలు ఉండి ముస్లిం సమాజం "ఈదుల్ ఫితర్ (దానాల పండుగ)" చేసుకునే ఓ ఉన్నత విధానం ఇస్లాం నిర్దేశిస్తుంది.ఇస్లాం నిర్దేశించే రెండే రెండు పండుగల్లో ఒకటి "ఈదుల్ ఫిత్ర్" అన్నది దానాలు చెయ్యటాన్ని నేర్పే నెల అయితే దీని తరువాత వచ్చే మరో పండుగ "ఈదుల్ – అద్ హా అంటే "త్యాగాల పండుగ" అని అర్థం దీనినే "బక్రీద్" అంటారు.

దానం విషయంలో చివరకు ఒక ఖర్జూరమైనా దానం చేసి మీరు నరకాగ్ని నుండి రక్షించుకోమని ప్రవక్త ముహమ్మద్ (స) సెలవిచ్చారు. అలాగే స్వయంగా ప్రవక్త ముహమ్మద్ (స) – పొరుగువాడు ఆకలిగా ఉండగా తాను మాత్రం కడుపునిండా తినేవాడు అసలు విశ్వాసే కాదన్నారు.ఏదైనా దానం చెయ్యమని ప్రవక్త ముహమ్మద్(స) ఇంటికి వస్తే ఇంట్లో ఏమీ లేనప్పటికీ ఇంట్లో ఒకటో రెండో ఖర్జూరాలు ఉంటే చివరకు వాటిని సైతం దానం చేసిన సంఘటనలు ఎన్నో ఉన్నాయి. దీనిని బట్టి ఇస్లాం దానానికి ఎంత గొప్ప ప్రాముఖ్యత ఇస్తుందో అర్థం చేసుకోవచ్చు.రంజాన్ నెలలో ప్రతీ ఒక్కరూ "ఫిత్రా (దానం)" మాత్రమే కాక ఆస్తి పరులకు "జకాత్" సైతం ఇవ్వమనే ఆజ్ఞను సైతం ఖురాన్ ఇస్తుంది. ఖురాన్ లో నమాజ్ (ప్రార్థన) చెయ్యమనే ఆజ్ఞ ఇవ్వబడినప్పుడల్లా దానితో పాటే "జకాత్" సైతం ఇవ్వమనే ఆజ్ఞను కొన్ని వందల సార్లు చూడగలం. "జకాత్" అన్నది ఆస్తిపాస్తులు, భూములు, డబ్బు బంగారం కలిగి ఉన్నవారు వాటిపై కొంత శాతాన్ని తీసి బీదసాదలు, అగత్య పరులకు పంచాల్సిన దానం అని అర్థం.దానాలు విస్తృతంగా చెయ్యటమే! మన సంతోషంలో బీదసాదలకు భాగస్వాములు చెయ్యాలి. అందుకోసమే ఈ "ఈదుల్ ఫితర్" పండుగ నిర్దేశించబడింది. అలాగని పండుగ రోజు కొత్త బట్టలు, హంగూ ఆర్భాటాలు అవసరంలేదా? అంటే అవకాశం ఉనోల్లు ఇంటిల్లిపాదీ కొత్తబట్టలు కొని ధరించటంలో తప్పులేదు, కానీ అది రూల్ కూడా కాదు, సెంటిమెంటుగా అప్పు చేసి మరీ కొనాల్సిన పని అస్సలు లేదు. ఉన్న దాంట్లోనే మంచి బట్టలు ధరించి పండుగ చేసుకోవటం ప్రవక్త సాంప్రదాయం కూడా. కానీ, అత్యధికంగా ప్రాముఖ్యత ఇవ్వాల్సిన అంశం మటుకు కేవలం ఉన్నంతలో ఎక్కువగా దానాలు చెయ్యటమే! అప్పుడే "దానాల పండుగ" అసలు ఉద్దేశం నెరవేరేది కూడా.అంతేకాక, ముస్లిములు తమ ఇరుగుపొరుగున ఉండే ముస్లిమేతరులతో తమ పండుగ సంతోషాన్ని పంచుకోవాలి. తాము వండుకునే వంటలను వారికి సైతం పంచుతూ చక్కటి ఐక్యతతో కూడిన వాతావరణాన్ని పెంపొందించాలి.

# జనసేన పార్టీ బలోపేతమే లక్ష్యం

**పార్టీ అధినేత, డిప్యూటీ సీఎం పవన్ కళ్యాణ్ ఆశయాలను నెరవేరుస్తాం**

**అన్ని నియోజకవర్గాలలో పార్టీని క్షేత్రస్థాయిలో బలపరుస్తాం**

**రానున్న మున్సిపల్, పంచాయతీ ఎన్నికల్లో జనసేన జెండా ఎగురవేస్తాము**

**ఎన్టీఆర్ జిల్లా జనసేన పార్టీ అధ్యక్షులు సామినేని ఉదయభాను**





**విజయవాడ సెంట్రల్ మేజర్ న్యూస్:** విజయవాడ నగరంతో పాటు, రూరల్ మండలం, తిరువూరు, నందిగామ, మైలవరం, జగ్గయ్యపేట నియోజకవర్గాల్లో కూడా పార్టీ రోజు రోజుకి స్థానిక నాయకత్వంనీ కలుపుకొని పార్టీని రోజు రోజుకి బలోపేతం చేయడానికి ప్రణాళికలు సిద్ధం చేస్తూ ముందుకు వెళ్తున్నామని ఎన్టీఆర్ జిల్లా జనసేన పార్టీ అధ్యక్షులు సామినేని ఉదయభాను అన్నారు. ఆదివారం విజయవాడ సెంట్రల్ నియోజకవర్గంలో 25 వ డివిజన్ నుండి ప్రముఖ న్యాయవాది కొంపల్లి అరుణ్ కుమార్ (నాని) తో పాటు ఆయన సన్నిహితులను, సామినేని ఉదయభాను పార్టీ కండువా కప్పి జనసేన లోకి సాదరంగా ఆహ్వానించారు. తొలుత విజయ్ టాకీస్ దగ్గర హుస్సేన్ సాహెబ్ వీధి నుండి భారీ ర్యాలీగా వందలాది మంది జన సైనికులతో కలిసి ఊరేగింపుగా కందుకూరి కళ్యాణ మండపానికి విచ్చేశారు. అనంతరం ఉదయభాను మాట్లాడుతూ మొట్టమొదటిగా తనను రాజకీయాల్లో ప్రోత్సహించినవారు వంగవీటి రంగా 1986 లో యువజన కాంగ్రెసు పార్టీ అధ్యక్షులుగా నియమించారని, అనంతరం దివంగత నేత మాజీ సీఎం వైయస్ రాజశేఖర్ రెడ్డి కూడా ప్రోత్సహించారని గుర్తు చేశారు. ప్రస్తుతం జనసేన అధినేత డిప్యూటీ సీఎం పవన్ కళ్యాణ్ గారి స్ఫూర్తితో జనసేన పార్టీ బలోపేతం కోసం తన వంతు కృషి చేయడానికి ఎల్లప్పుడూ ముందుంటానని తెలిపారు. రానున్న మున్సిపల్, పంచాయతీ ఎన్నికల్లో జనసేన జెండా ఎగురవేస్తామన్నారు. పార్టీ బలోపేతం కోసం పనిచేస్తున్న వారికి పార్టీలో ప్రభుత్వంలో కూడా ప్రాధాన్యత ఇవ్వడానికి కృషి చేస్తానని వెల్లడించారు. అనంతరం ప్రముఖ న్యాయవాది కొంపల్లి అరుణ్ కుమార్ (నాని) మాట్లాడుతూ ఉదయభాను నేతృత్వంలో తన వంతుగా పార్టీ బలోపేతం చేస్తానని స్పష్టం చేశారు. జనసేన పార్టీ నాయకులకి కార్యకర్తలకి వీర మహిళలకి అందరికీ తనవంతుగా ఉచిత న్యాయ సలహాలు, ఉచిత న్యాయ సేవలు అందిస్తానని పేర్కొన్నారు. ఈ కార్యక్రమంలో దొండపాటి శేషుబాబు, కాజా మొయిద్దీన్ షేక్, గంజి సునీల్, దినేష్ నాయుడు, తోట అభిలాష్, పామర్తి, ఎమ్. సతీష్, మోహన్, దిలీప్, కిరణ్, బబ్లూ తదితరులు పార్టీ తీర్థం పుచ్చుకున్నారు. ఈ కార్యక్రమంలో సెంట్రల్ ఆంధ్ర జోన్ కన్వీనర్ బాడిత శంకర్, కృష్ణ పెన్నా రీజియన్ కోఆర్డినేటర్ రావి సౌజన్య, పీ ఏ సీ సంయుక్త కార్యదర్శి పోతిరెడ్డి అనిత, కార్పొరేటర్ మహదేవపు అప్పాజీ, రూరల్ మండలం అధ్యక్షులు పొదిలి దుర్గారావు, జనసేన పార్టీ సానుభూతులు ప్రముఖ వైద్యులు కొండవీటి సంతోష్ కృష్ణ, గాదిరెడ్డి అమ్ములు, అశోక్, శ్రీకాంత్ (స్వామి) పాల్గొన్నారు.

## మాజీ మంత్రి జోగి రమేష్‌ను మర్యాదపూర్వకంగా కలిసిన చెన్నూరు సుబ్బారావు జడ రాంబాబు



**జి.కొండూరు మేజర్ న్యూస్ :** మాజీ ముఖ్యమంత్రి వైయస్ జగన్మోహన్ రెడ్డి ఆదేశానుసారం, మాజీ మంత్రి జోగి రమేష్ ఆశీస్సులతో మైలవరం నియోజకవర్గ ప్రచార కమిటీ అధ్యక్షులుగా చెన్నూరు సుబ్బారావు, జి.కొండూరు మండల పార్టీ అధ్యక్షులుగా జడరాంబాబు నియమితులుగా కేంద్ర కార్యాలయం నుంచి ఆదేశాలు రాగా వారికి హృదయపూర్వక శుభాకాంక్షలు తెలియజేశారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ మైలవరం నియోజకవర్గంలో వైఎస్ఆర్సిపి బలోపేతానికి తమ వంతు కృషి చేస్తామని వారు తెలిపారు తమపై నమ్మకం ఉంచి మాకు ఈ బాధ్యతలు అప్పగించిన మాజీ ముఖ్యమంత్రి వైఎస్ జగన్మోహన్ రెడ్డి కి మాజీ మంత్రి జోగి రమేష్ కు ఎన్టీఆర్ జిల్లా అధ్యక్షులు దేవినేని అవినాష్ కు ప్రత్యేక కృతజ్ఞతలు తెలిపారు, ఈ పదవి రావటానికి సహకరించిన ప్రతి ఒక్కరికి పేరుపేరునా ధన్యవాదాలు తెలిపారు.

## జోజిమేరీకి అంబేద్కర్ ఉగాది పురస్కార అవార్డు



**కంచికచర్ల మార్చి 30 మేజర్ న్యూస్ :** కంచికచర్లకు చెందిన రాష్ట్ర జై భీమ్ మహిళ సంఘం అధ్యక్షురాలు దియ్యాల జోజి మేరీ కి ఆదివారం ప్రకాశం జిల్లా ఒంగోలు లో అంబేద్కర ఉగాది పుష్కర అవార్డు దక్కింది. రిపబ్లిక్ పార్టీ రాష్ట్ర అధ్యక్షుడు దాసరి చెన్నకేశవులు, రాష్ట్ర ఉద్యోగ సంఘం అధ్యక్షులు అశోక్ బాబుల చేతుల మీదుగా అందజేశారు. ఈ సందర్భంగా జోజిమేరి మాట్లాడుతూ ఈ అవార్డు అందజేసిన వారికి కృతజ్ఞతలు తెలిపారు. ఈ అవార్డు నాకు అంబేద్కర్ పేరు మీద రావటం నా అదృష్టం అని అన్నారు. ఈ అవార్డు ను స్ఫూర్తిగా తీసుకుని రాష్ట్రంలో అన్ని గ్రామాల్లో కమిటీలు వేసి అంబేద్కర్ ఆలోచన విధానాన్ని ముందుకు తీసుకెళ్తానని స్పష్టం చేశారు. ఈ కార్యక్రమంలో జై భీమ్ మహిళ సంఘం కమిటీ సభ్యులు బర్రె బుజ్జి, దగ్గుపాటి అక్కమ్మ, ధూపల ప్రశాంతి, తదితరులు పాల్గొన్నారు.

## మాజీ మంత్రిని మర్యాదపూర్వకంగా కలిసిన రెంటపల్లి



**జి కొండూరు మేజర్ న్యూస్ :** ఇబ్రహీంపట్నం మండలం కొటికలపూడి గ్రామ ముద్దు బిడ్డ, యంగ్ లీడర్ ఇబ్రహీంపట్నం వైస్సార్సీపీ మండల అధ్యక్షులు గా నియమించబడిన సర్పంచ్ రెంటపల్లి నాగరాజు (డాన్ ) మర్యాదపూర్వకంగా మైలవరం నియోజకవర్గం ఇంచార్జి జోగి రమేష్‌ని కలిశారు. ఈ సందర్భంగా జోగి రమేష్ మండల పార్టీ అధ్యక్షులు గా ఎన్నుకోబడిన సర్పంచ్ రెంటపల్లి నాగరాజు ని దుశాలువాతో, పూలబొకేతో సత్కరించి అభినందనలు తెలియజేసారు. ఈ కార్యక్రమం లోపలువురు పార్టీ ఎంపీటీసీలు, సర్పంచ్ లు, జడ్పీటీసీ లు, గ్రామ పార్టీ అధ్యక్షులు,సీనియర్ నాయకులు, కార్యకర్తలు పాల్గొన్నారు..

## మాజీ సర్పంచ్ గద్దే సరస్వతి కన్నుమూత



**కంచికచర్ల మార్చి 30 మేజర్ న్యూస్:**కంచికచర్ల మాజీ సర్పంచ్ గద్దె సరస్వతి ఆదివారం కన్నుమూశారు.గత మూడు సంవత్సరాలుగా ఆమె అనారోగ్యంతో బాధపడుతున్నారు. ఆరోగ్యం మరింత క్షీణించడంతో గత 15 రోజుల క్రితం భవానిపురంలోని భవాని హాస్పిటల్ లో వైద్యం చేస్తున్నట్లు కుటుంబ సభ్యులు తెలిపారు. వైద్యం పొందుతూ ఆదివారం సరస్వతి మృతి చెందినట్లు వారు తెలిపారు. తెలుగుదేశం పార్టీకి సరస్వతి ఎనలేని కృషి చేశారు. ఈమె 2001 నుండి2006 వరకు సర్పంచ్ గా ఐదు సంవత్సరాలు పనిచేశారు. ఈమె సర్పంచ్ గా ఉండగా గ్రామపంచాయతీ ఎంతో అభివృద్ధి సాధించింది. గ్రామపంచాయతీ కాంప్లెక్స్, పాల కేంద్ర భవన నిర్మాణాలు జరిగి పంచాయతీకి నికర ఆదాయం వన కూడింది. అంతేకాకుండా స్థానికంగా అంతర్గత సిమెంట్ రోడ్లు డొంక రోడ్లు నిర్మాణం చేసుకొని ఎంతో పురోభివృద్ధి సాధించింది. సరస్వతి మృతి తెలుగుదేశం పార్టీ నాయకులను దిగ్భ్రాంతికి గురిచేసింది. తెలుగుదేశం పార్టీకి ఆమె లేని లోటు తీరనిదని పలువురు బాధను వ్యక్తం చేశారు.

# భక్తులతో కిటకిటలాడిన నాగేంద్ర స్వామి దేవాలయం



**కంచికచర్ల మార్చి 30 మేజర్ న్యూస్ :** స్థానిక జుజ్జూరు రోడ్లో వేంచేసి ఉన్న శ్రీ నాగేంద్ర స్వామి వారి బ్రహ్మోత్సవాలు కార్యక్రమం ఆదివారం ఘనంగా జరిగింది. తెల్లవారుజాము నుండి భక్తులు దేవాలయానికి పోటెత్తారు.ప్రతి ఏడాది ఉగాది తరువాత మొదటి ఆదివారం జరిగే ఈ బ్రహ్మోత్సవాలు తిరునాళ్ల కార్యక్రమం ఉగాది రోజే రావడం విశేషం సంతరించుకుంది.ఉగాది పర్వదినం నాగేంద్ర స్వామి తిరునాళ్ల రెండు కలిసి రావడంతో దేవాలయానికి భక్తులు అధిక సంఖ్యలో పాల్గొన్నారు. స్వామివారికి పొంగళ్ళ ను సమర్పించి మొక్కుబడులు తీర్చుకొని భక్తులు వారి యొక్క భక్తిని చాటుకున్నారు. బ్రహ్మోత్సవాలు తిరునాళ్ల నిర్వాహకులైన యువజన మిత్ర మండలి వారు దేవాలయ ప్రాంగణాన్ని సుందరంగా తీర్చిదిద్దారు.విద్యుత్ దీపాలతో అలంకరించారు.దేవాలయ దర్శనార్థమై వచ్చిన భక్తులకు భారీ అన్నదానం ఏర్పాటు చేశారు. స్వామివారి ప్రభను స్థానిక ప్రధాన వీధుల్లో ఊరేగింపు నిర్వహించారు. స్థానిక వైసీపీ పట్టణ అధ్యక్షుడు వేమ సురేష్ బాబు ఆధ్వర్యంలో మధ్యాహ్నం ఎండ తీవ్రంగా ఉండటంతో భక్తులకు మజ్జిగ పంపిణీ చేశారు. సాయంకాలం మాట్లాడే బొమ్మ,మిమిక్రీ,కోలాటం వివిధ రకాల సాంస్కృతిక కార్యక్రమాలు నిర్వహించారు. ఈ కార్యక్రమాలు భక్తులను ఆకట్టుకున్నాయి.ఉగాది పండుగ, నాగేంద్ర స్వామి తిరునాళ్ల పురస్కరించుకొని భక్తులు దేవాలయానికి ఎక్కువ సంఖ్యలో పాల్గొనడంతో ఎటువంటి అవాంఛనీయ సంఘటనలు జరగకుండా ఎస్సై రాజు కట్టుదిట్టమైన భద్రతా ఏర్పాట్లు చేశారు.జుజ్జూర్ రోడ్లో ట్రాఫిక్ అంతరాయం కలగకుండా సిబ్బందిచే వాహనాల రాకపోకలను క్రమబద్ధీకరించారు. బ్రహ్మోత్సవాలు తిరునాళ్ల నిర్వాహకులు యువజన మిత్రమండలి వారిచే భారీ అన్నదాన కార్యక్రమం జరిగింది.



## మైలవరం తెలుగుదేశం కార్యాలయంలో ఉగాది వేడుకలు

**జి కొండూరు మేజర్ న్యూస్ :** మైలవరం శాసనసభ్యులు వసంత వెంకట కృష్ణ ప్రసాద్ ఆదేశాల మేరకు మైలవరం నియోజకవర్గం మైలవరం తెలుగుదేశం పార్టీ ఆఫీసులో విశ్వావసు నామ సంవత్సర ఉగాది సందర్భంగా అత్యంత భక్తిశ్రద్ధలతో పూజా కార్యక్రమం అత్యంత వైభవంగా నిర్వహించడం జరిగినది. ప్రజలంతా సుఖ సంతోషాలతో వర్ధిల్లాలని పూజలు నిర్వహించారు ఈ పూజా కార్యక్రమంలో మైలవరం తెలుగుదేశం పార్టీ పట్టణ నాయకులు కార్యకర్తలు పాల్గొన్నారు.

## పగడాల ప్రవీణ్ మృతిపై సమగ్ర దర్యాప్తు చేపట్టాలి




**చల్లపల్లి మేజర్ న్యూస్ :** అనుమానాస్పద రీతిలో మృతిచెందిన క్రైస్తవ మత ప్రచారకుడు పగడాల ప్రవీణ్ మృతిపై పోలీసులు సమగ్ర దర్యాప్తు చేపట్టాలని పలువురు దైవసేవకులు డిమాండ్ చేశారు. చల్లపల్లి ఏరియా దైవజనుల ఆధ్వర్యంలో ఆదివారం సాయంత్రం చల్లపల్లిలో నిరసన ర్యాలీ జరిగింది. చల్లపల్లి రాజా కళాశాల వద్ద నుంచి ప్రారంభమైన ర్యాలీ ప్రధాన సెంటరు మీదుగా బస్టాండ్ సెంటరు వరకు చేరుకుని తిరిగి చల్లపల్లి ప్రధాన సెంటరుకు చేరుకుని కొవ్వొత్తులు వెలిగించి ప్రవీణ్ మృతిపట్ల సంతాపం వెలిబుచ్చారు. ఈ సందర్భంగా దైవసేవకులు మాట్లాడుతూ, పగడాల ప్రవీణ్ మృతిపై క్రైస్తవుల్లో ఎన్నో అనుమానాలున్నాయన్నారు. ప్రవీణ్ను హత్యచేసి ఉంటారనే ఆవేదన ప్రతి క్రైస్తవునిలోనూ ఉందనీ, పోలీసుశాఖ నిజానిజాలు నిగ్గుతేల్చాలని కోరారు. ఉయ్ వాంట్ జస్టిస్ అంటూ నినాదాలు చేశారు. ఈ కార్యక్రమంలో విశ్రాంత డీఎస్పీ కె. హరిరాజేంద్రబాబు, పాస్టర్ ఎం.మరియకుమార్, పి.దేవదానం, పి.సాల్మన్ రాజు, జి.ప్రదీప్కుమార్, తాతా సత్యమూర్తి, గోల్కొండ ఏసురాజు, పి.ఏసుదాసు, జి. దేవిద్దతోపాటు మోపిదేవి, ఘంటసాల మండలాల పాస్టర్లు, క్రైస్తవులు పెద్దఎత్తున పాల్గొన్నారు.

## గాంధీ క్షేత్రంలో ఉగాది పంచాంగ శ్రవణం




**అవనిగడ్డ, మేజర్ న్యూస్ :** శ్రీ విశ్వావసు సంవత్సర ఉగాది పర్వతనాన్ని పురస్కరించుకుని ఆదివారం సాయంత్రం గాంధీ క్షేత్రంలో పంచాంగ శ్రవణం జరిగింది. శాసనసభ్యులు మండలి బుద్ధప్రసాద్ ఆధ్వర్యంలో ఏర్పాటుచేసిన ఈ కార్యక్రమంలో వేద పండితులు ఘనపాటి నౌడూరి విశ్వనాథ సుబ్రహ్మణ్య శాస్త్రి శాస్త్రోక్తంగా పంచాంగ శ్రవణం వినిపించారు. ఈ కార్యక్రమంలో డాక్టర్ గుడిసేవ విష్ణుప్రసాద్, సీనియర్ నాయకులు మత్తి శ్రీనివాసరావు, కూటమి నాయకులు, పలువురు గ్రామ ప్రముఖులు పాల్గొన్నారు. యువనాయకులు మండలి వెంకట్రామ్ పర్యవేక్షణలో జరిగిన ఈ కార్యక్రమం అనంతరం వేద పండితులను ఘనంగా సత్కరించారు.

## ఇంటి పన్ను, ఖాళీ స్థలాల పన్ను బకాయిలపై
# 50% వడ్డీ రాయితీకి నేడే చివరి అవకాశం
### వీఎంసీ ఇంచార్జ్ కమిషనర్ డాక్టర్ డి చంద్రశేఖర్

**విజయవాడ కార్పొరేషన్, మేజర్ న్యూస్ :** ఇంటి పన్ను, ఖాళీ స్థలాల పన్ను బకాయిల పై 50% వడ్డీ రాయితీ కి నేడే చివరి అవకాశం అన్నారు నగరపాలక సంస్థ ఇంచార్జ్ కమిషనర్ డాక్టర్ డి చంద్రశేఖర్. ఆంధ్రప్రదేశ్ రాష్ట్ర ప్రభుత్వ ఉత్తర్వుల మేరకు ఇంటి పన్ను ఖాళీ స్థలాల పన్ను బకాయల పై 50 శాతం వడ్డీ రాయితీతో చెల్లించుటకు మార్చి 31, 2025 చివరి అవకాశం అయినందున, రంజాన్ పండుగ సందర్భంగా సెలవు దినము అయినప్పటికీ నగరపాలక సంస్థ పరిధిలో గల 13 క్యాష్ కౌంటర్ అన్నును ఉదయం 6 గంటల నుండి రాత్రి 9 గంటల వరకు అందుబాటులో ఉంటుందని తెలిపారు. నగర పరిధిలో గల అన్ని సచివాలయంలో కూడా పనులు చెల్లించవచ్చని అన్నారు. ప్రజలు ఆన్లైన్ లో కూడా పన్ను బకాయిలను చెల్లించవచ్చని, ఆన్లైన్లో కూడా ఇంటి పన్ను, ఖాళీ స్థలాల పన్ను బకాయిలపై 50 శాతం వడ్డీ రాయితీ ఉందని అన్నారు..

## శ్రీ విజ్ఞాన విహార్ పాఠశాలకు స్మార్ట్ టీవీలు బహూకరణ

**అవనిగడ్డ, మేజర్ న్యూస్ :** మారుతున్న టెక్నాలజీకి అనుగుణంగా విద్యార్థులకు సాంకేతికతతో కూడిన విద్యను అందించేందుకుగాను సిగ్నోడ్ ఇండియా సాఫ్ట్వేర్ కంపెనీ వారు శ్రీ విజ్ఞాన విహార ఇంగ్లీష్ మీడియం పాఠశాలకు 5 స్మార్ట్ టీవీలను బహుకరించారు. ఉగాది సందర్భంగా పంచాయతీరాజ్ శాఖకు సంబంధించిన హైకోర్టు లైజన్ ఆఫీసర్ యలవర్తి సుబ్రహ్మణ్యం టీవీలను ప్రారంభించారు. ఈ కార్యక్రమంలో పాఠశాల కార్యదర్శి సింహాద్రి రామ లింగేశ్వర రావు, అభివృద్ధి కమిటీ సభ్యులు ఉదయ్ కుమార్, ప్రిన్సిపల్ నాగ సూర్యతేజ పాల్గొన్నారు. విద్యార్థుల అభ్యున్నతికి టీవీలు అందించిన సిగ్నోడ్ ఇండియా సాఫ్ట్వేర్ సంస్థ యాజమాన్యానికి, సహకరించిన ప్రతి ఒక్కరికి పాఠశాల యాజమాన్యం సిబ్బంది హృదయపూర్వక ధన్యవాదములు తెలియజేశారు.

## పాస్టర్ ప్రవీణ్ పగడాల మృతికి సంతాపం



**ఘంటసాల, మేజర్ న్యూస్:** ఇటీవల అనుమాన స్పందంగా మృతి చెందిన దైవ ప్రభోదకులు పాస్టర్ ప్రవీణ్ పగడాల సంతాప సమావేశం ఘంటసాల మండల పాస్టర్స్ ఆధ్వర్యంలో ఆదివారం సాయంత్రం ఘంటసాల గిల్గాలు బేతేలు చర్చిలో నిర్వహించారు. పలువురు దైవజనులు ప్రవీణ్ పగడాల క్రైస్తవ్యానికి చేసిన సేవలను కొనియాడారు. చివరి క్షణంలో అనుమానస్పద మృతి చెందిన ప్రవీణ్ పగడాలకు సంతాపం తెలపడంతో పాటు కుటుంబ సభ్యులకు ప్రగాఢ సానుభూతిని తెలిపారు. అనుమాన స్పదంగా మృతి చెందిన ప్రవీణ్ పగడాల అనుమానస్పద మృతి పై ప్రభుత్వం, అధికారులు నిజాలు నిగ్గుతేల్చి దోషులను గుర్తించి చట్టప్రకారం చర్యలు తీసుకోవడంతో పాటు క్రైస్తవులకు రక్షణ కల్పించాలని కోరారు. ఏప్రిల్ 1 మంగళవారం ఉదయం 10 గంటలకు ఘంటసాల మండల పాస్టర్ల ఆధ్వర్యంలో ఘంటసాల సెంటర్ నుంచి తహసీల్దార్ కార్యాలయం వరకు జరిగే శాంతియుత ర్యాలీని విజయవంతం చేయాలని పాస్టర్లు పిలుపునిచ్చారు. ఈ కార్యక్రమంలో ఘంటసాల మండల పాస్టర్లు పాల్గొన్నారు.

# సేన దినపత్రిక ఆధ్వర్యంలో ఘనంగా ఉగాది సంబరాలు







**నందిగామ, మార్చి 30, మేజర్ న్యూస్:** పట్టణంలో బాబు జగజీవన్ ఫంక్షన్ హాల్ నందు సేన దినపత్రిక ఆధ్వర్యంలో ఉగాది సంబరాలు ఘనంగా నిర్వహించారు. సేన దినపత్రిక పాత్రికేయులు పాలడుగు సాంబ ఆధ్వర్యంలో పూజారులు పంచాంగ శ్రవణం ఘనగ నిర్వహించారు. ఈ కార్యక్రమంలో ముఖ్య అతిథులుగా చైర్మన్ మండవ కృష్ణకుమారి, ఎంపీపీ రమాదేవి, కమిషనర్ రమణబాబు, కూటమి నాయకులు ఏచూరి రాము, కాసర్ల లక్ష్మీనారాయణ, తొర్లికొండ సీతారామయ్య, కేదార్నాథ్ శర్మ, పూజారి రాజేష్ పారేపల్లి సాయి తదితరులకు ఘన సన్మానం నిర్వహించారు. ఈ కార్యక్రమంలో పట్టణ ప్రముఖులు, వివిధ రాజకీయ పార్టీల నాయకులు, పాత్రికేయులు తదితరులు పాల్గొన్నారు.

## నేడు ప్రజా ఫిర్యాదుల పరిష్కార వేదిక లేదు

**విజయవాడ కార్పొరేషన్, మేజర్ న్యూస్ :** రంజాన్ పండుగ సందర్భంగా సెలవు దినము అయినందున కార్పొరేషన్, ప్రధాన, జోనల్ కార్యాలయాలలో ప్రజా ఫిర్యాదుల పరిష్కార వేదిక లేదని విజయవాడ నగరపాలక సంస్థ ఇంచార్జి కమిషనర్ డాక్టర్ డి చంద్రశేఖర్ ఆదివారం నాడు విడుదల చేసిన ప్రకటనలో తెలిపారు.

## సీతారామచంద్రుల కళ్యాణానికి ముహూర్తం



**అవనిగడ్డ, మేజర్ న్యూస్ :** అవనిగడ్డ మూడవ వార్డులో వేం చేసి ఉన్న శ్రీ కోదండ రామాలయం లోని శ్రీ రామనవమి సీతారా ముల కళ్యాణ మహో త్సవాన్ని నిర్వహిం చేందుకు ఆలయ కమిటీ గ్రామ పెద్దల సమక్షంలో ఆలయ ప్రధాన అర్చక పండితులు క్రోవి శ్రీరామమూర్తి ఆదివారం ఉదయం ముహూర్తం నిర్ణయించారు. శ్రీరామనవమి పర్వదినాన్ని పురస్కరించుకొని సీతారాముల కళ్యాణ వేడుకలో భాగంగా ఏప్రియల్ 2 వ తేదీ బుధవారం ఉదయం 8 50 నిమిషములకు పసుపు కొట్టుట 3వ తేదీ గురువారం ఉదయం 9.05 నిమిషములకు పందిరి గుంజ పాదుట 5వ తేదీ శనివారము 10 గంటలకు పెండ్లి కుమారుడు పెళ్లి కుమార్తెను చేసి మంగళ స్థానాలు చేయుట ఆ 6వ తారీకు ఉదయం తొమ్మిది 30 నిమిషాలకు సీతారాముల వారి కళ్యాణము అంగరంగ వైభవంగా నిర్వహించేందుకు ఏర్పాటులన్నీ చేసినట్లు తిరుమల తిరుపతి దేవస్థానం అవనిగడ్డ మండల ధర్మాచార్యులు ఆలయ ధర్మకర్త అన్నపరెడ్డి కృష్ణ చెప్పారు. ఆలయ ధర్మకర్తలు ఓంకార నాగభూషణం, అన్నపురెడ్డి శ్రీనివాసరావులు ఆలయ ప్రధాన అర్చకులు శ్రీరామ్ మూర్తి నుండి లగ్నపత్రిక అందుకున్నారు. ఈ కార్యక్రమంలో ఆలయ ధర్మకర్తలు అన్నపరెడ్డి అంజయ్య అంబుల వెంకటప్పయ్య తదితరులు పాల్గొన్నారు.

## మళ్ళీ వాయిదా పడిన బహిరంగ ఆశీల వేలంపాట.

**అవనిగడ్డ, మేజర్ న్యూస్ :** అవనిగడ్డ పంచాయతీ రోజువారి ఆశీలు పాట మళ్ళీ వాయిదా పడింది. ఆదివారం మధ్యాహ్నం పంచాయతీ కార్యదర్శి బి అనిత సర్పంచ్ గురుముచ్చు ఉమా సమక్షంలో బహిరంగ వేలంపాట నిర్వహించగా ఒక్కొక్కరు ఐదు లక్షల రూపాయలు చొప్పున డిపాజిట్ చెల్లించి బహిరంగ వేలంపాటలో ఆరుగురు పాల్గొనగా పంచాయతీ అధికారులు ఆశించిన పాట రాకపోవడంతో సోమవారం మధ్యాహ్నం 3 గంటలకు వాయిదా వేశారు. శనివారం జరగాల్సిన పాట ఆది వారానికి వాయిదా పడగా మళ్ళీ వాయిదా పడింది.ఈ కార్యక్రమంలో ఉపసర్పంచ్ కోడూరు సత్యనారాయణ. మాజీ ఉపసర్పంచ్ గాజుల జై గోపాల్ పంచాయతీ వార్డు సభ్యులు పంచాయతీ సిబ్బంది తదితరులు పాల్గొన్నారు.



## లంకమ్మ తల్లిని దర్శించుకున్న ఎమ్మెల్యే కుటుంబ సభ్యులు

**అవనిగడ్డ, మేజర్ న్యూస్ :** శ్రీ విశ్వా వసు సంవత్సర ఉగాది పర్వదినాన్ని పురస్కరించుకుని దివిసీమ భక్తుల కొంగు బంగారంగా పూజలు అందుకుంటున్న అవనిగడ్డ శ్రీ లంకమ్మ అమ్మవారిని ఆదివారం శాసనసభ్యులు మండలి బుద్ధప్రసాద్ సతీమణి మండలి విజయలక్ష్మి, మండలి వెంకట్రామ్, సాయి సుప్రియ, శీలం అశ్విన్ కుమార్అ, కృష్ణ ప్రభ లుమ్మవారిని దర్శించుకుని ప్రత్యేక పూజలు జరిపించారు.దేవాదాయ శాఖ ఈవో యార్లగడ్డ శ్రీనివాసు వారికి ఘన స్వాగతం పలికారు. అనంతరం జరిగిన ఉగాది వేడుకల్లో పాల్గొన్నారు. దేవాలయ అర్చకులు లంకమ్మ తల్లి ప్రసాదం, ఆశీస్సులు అందజేసి వారిని ఘనంగా సత్కరించారు.

## వాటర్ ట్యాంకర్ ప్రారంభించిన ఎమ్మెల్యే బుద్ధప్రసాద్



**అవనిగడ్డ, మేజర్ న్యూస్ :** వేసవిలో తాగునీటి ఎద్దడి నివారణకు ముందు జాగ్రత్తగా వాటర్ ట్యాంక్ సిద్ధం చేసినట్లు ఎమ్మెల్యే మండలి బుద్ధప్రసాద్ తెలిపారు. ఆదివారం సాయంత్రం స్థానిక గాంధీ క్షేత్రం వద్ద మండలి ఫౌండేషన్ ఆధ్వర్యంలో సిద్ధం చేసిన ఇరవై వేల లీటర్ల సామర్థ్యం కలిగిన వాటర్ ట్యాంకరు ను ఎమ్మెల్యే మండలి బుద్ధప్రసాద్ – విజయలక్ష్మి దంపతు లు పూజలు చేసి ప్రారంభించారు. ఈ ట్యాంక్ ద్వారా నియోజకవర్గంలోని తీర గ్రామాల్లో వేసవిలో తాగునీటి ఎద్దడి తలెత్తే గ్రామాలకు మండలి ఫౌండేషన్ ఆధ్వర్యంలో తాగునీరు సరఫరా చేస్తామని ఎమ్మెల్యే తెలిపారు. కార్యక్రమంలో ప్రాజెక్టు కమిటీ చైర్మన్ దేవనబోయిన వెంకటేశ్వరరావు, నియోజవర్గ యువ నాయకులు మండల వెంకట్రామ్, టీడీపీ, జనసేన, బీజేపీ నాయకులు పాల్గొన్నారు.

## శ్రీ భావన రుషి దేవాలయ ప్రాంగణంలో పంచాంగ శ్రవణం

**ఘంటసాల, మేజర్ న్యూస్:** మండల కేంద్రమైన ఘంటసాల లో వేంచేసి ఉన్న శ్రీ భద్రావతి సమేత భావన రుషి దేవాలయ ప్రాంగణంలో చైర్మన్ జగదీష్ ఆధ్వర్యంలో విశ్వా వసు నామ సంవత్సరం లో పంచాంగం శ్రవణం లో పాడి పంటల తో ప్రజలు సమృద్ధిగా జీవనం సాగిస్తారని పిసుపాటి నరసింహారావు తెలిపారు. ఈ సందర్భంగా పంచాంగ శ్రవణంలో పిసుపాటి పంచాంగ శ్రవణం చేస్తూ ప్రపంచాన్ని విష్ణుమూర్తి కాపాడతాడని, 16 వీసాల పంటకు 8 వీసాలు ప్రజలకు దక్కుతుందని, ఎర్రని భూములు బాగా పండుతాయి అని, మిర్చి గోధుమ కందులు వంటి పంటలు బాగా పండుతాయి అని, మినుములు పెసలు బాగా పండుతాయని తెలియజేశారు. వర్షాలు ఆలస్యం గా ప్రారంభమైనప్పటికీ ఆశాజనకంగా ఉన్నాయి అని సూర్యగ్రహణాలు మనకు కనిపించవు అన్నారు. పంచాంగ శ్రవణ కార్యక్రమంలో నరసింహా రావును దేవాలయ ప్రాంగణంలో అందె జగదీష్ ఆలయ కమిటీ అధ్యక్షులు, కమిటీ మెంబర్ లైన విటంశెట్టి దుర్గారావు, మురుగుడు నాంచారయ్య సతీమణి లక్ష్మి విఠం శెట్టి సుధాకర్, గుత్తికొండ సత్యనారాయణ, కొడాలి శ్రీకాంత్ దేవాలయ అర్చకులు గౌతమ్, దుశ్యాలు వాతొ సత్కరించినారు.



భక్తులు పాల్గొని పంచాంగ శ్రవణాన్ని ఆలకించినారు అనంతరం స్వామివారి తీర్థప్రసాదాలు స్వీకరించి షడ్రుచులతో చేయబడిన వేప పచ్చడని ఆస్వాదించారు.

## బీసీ సంఘం అధ్యక్షుడు దారం నరసింహారావు మృతి బాధాకరం : ఎమ్మెల్యే రాము



**గుడివాడ, మేజర్ న్యూస్:** గుడివాడ బీసీ సంఘం అధ్యక్షుడు, సోదరుడు దారం నరసింహారావు అకాల మృతి బాధాకరమని గుడివాడ ఎమ్మెల్యే వెనిగండ్ల రాము ఆవేదన వ్యక్తం చేశారు. దారం నరసింహరావు అనారోగ్యంతో శనివారం రాత్రి ఒక ప్రవేటు ఆసుపత్రిలో మృతి చెందారు. దారం నరసింహరావు మృతికి ఎమ్మెల్యే రాము సంతాపం వ్యక్తం చేస్తూ కుటుంబ సభ్యులకు ప్రగాఢ సానుభూతి తెలిపారు. తనకు సోదర సమానుడైన దారం నరసింహారావు మరణ వార్త తనను కలచి వేసిందని ఎమ్మెల్యే ఆవేదన వ్యక్తం చేశారు. 2024 సార్వత్రిక ఎన్నికల్లో గుడివాడలో తెలుగుదేశం పార్టీ విజయానికి నరసింహారావు అందించిన సహకారం ఎనలేనిదన్నారు. ఆయన పవిత్ర ఆత్మకు శాంతి కలగాలని భగవంతున్నీ ప్రార్థిస్తునానన్నారు. తనతో పాటు, టీడీపీ కూడా దారం కుటుంబ సభ్యులకు అండగా ఉంటుందని ఎమ్మెల్యే రాము భరోసా ఇచ్చారు.

## పార్టీ బలోపేతమే లక్ష్యంగా నాయకులందరినీ ఒకే వేదిక మీదకు



**గుడివాడ, మేజర్ న్యూస్:** గుడివాడ జనసేన పార్టీ బలోపేతమే లక్ష్యంగా నా యకులందరినీ ఒకే వేదిక మీదికి తీసుకురావడానికి దృఢ సంకల్పంతో పనిచేస్తు న్నామని ఆ పార్టీ నాయకు లు ప్రకటించారు. శుభంకర మానవ మహోదయ క్షేత్రం వ్యవస్థాపకులు రామిశెట్టి మురళి మోహన్ అధ్యక్షతన తెలుగు కొత్త సంవత్సరాది ఉగాది పండుగను పురస్క రించుకొని జనసేన పార్టీ ఐక్యవేదికను ఆదివారం గుడివాడలో నిర్వహిం చారు. ఈ కార్యక్రమంలో ఆయన సంస్థ 30వ వార్షికోత్సవాన్ని పురస్కరిం చుకుని ఆంధ్రజ్యోతి పూర్వ విలేఖరి లక్ష్మణరావుకి 5000 రూపాయలు ఆర్థిక సాయం అందజేశారు. ఆయన జనసేన పార్టీకి మద్దతుగా ఉంటూ పవన్ కళ్యాణ్ ఆశయాలను ముందుకు తీసుకువెళతానని జనసేన పార్టీ నాయకు లతో కలిసి ప్రయాణిస్తానని అందుకు మీరు ఐకమత్యంగా ఉండాలని అభి లాషించారు. ఈ కార్యక్రమానికి ముఖ్యఅతిథిగా విచ్చేసిన గుడివాడ నియో జకవర్గ జనసేన పార్టీ ఇంచార్జ్ బూరగడ్డ శ్రీకాంత్ చేతుల మీదుగా నగదు ను అందించడం జరిగింది. అలాగే గుడివాడ జనసేన పార్టీ నాయకులు సం దు పవన్, పేర్ని జగన్, పాలంకి సారధి అందరూ ఒకే వేదిక మీదకు వచ్చి జనసేన పార్టీని ఐకమత్యంగా బలోపేతం చేయాలని నిర్ణయించుకున్నారు.

## కాకర్ల విధి శ్రీరామాలయానికి శాస్త్రోక్తంగ దేవతామూర్తుల విగ్రహాలు సమర్పణ



**గుడివాడ, మేజర్ న్యూస్:** గుడివాడ పట్టణం కాకర్ల వీధిలోని శ్రీ రామాల యం దేవస్థాన పునర్ నిర్మాణాన్ని పురస్కరించుకొని మున్సిపల్ మాజీ ప్రతిపక్ష నేత గణపతి లక్ష్మణరావు జ్ఞాపకార్థం కుటుంబ సభ్యులు శ్రీ సీతారా మ లక్ష్మణ, ఆంజనేయ స్వామివార్ల విగ్రహాలను ఆదివారం సమర్పించారు. ఈ సందర్భంగా విగ్రహమూర్తులను మేళ తాళాల ఊరేగింపుతో దేవాలయం వద్దకు తీసుకువచ్చిన గణపతి లక్ష్మణరావు కుమారుడు శివ, భక్తులు, దేవస్థాన వేద పండితుడు శర్మకు అందజేశారు. ఈ సందర్భంగా విగ్రహ దాత గణపతి శివ మీడియాతో మాట్లాడుతూ కాకర్లది రామాలయానికి 50 ఏళ్ల చరిత్ర ఉందన్నారు. త్వరలో దేవస్థాన పునర్నిర్మాణం ప్రారంభం కానున్న దృష్ట్యా దేవతామూర్తులు విగ్రహాలను భక్తుల సహకారంతో అందించినట్లు తెలిపారు. ఏప్రిల్ ఆరవ తేదీన శ్రీరామనవమి దృష్ట్యా స్థానిక భక్తులందరం సమావేశమై కమిటీ ఏర్పాటు చేసుకొని వేడుకలను వైభవంగా నిర్వహిస్తామన్నారు. కాకర్ల వీధి రామాలయం అభివృద్ధికి ప్రతి ఒక్కరు సహకరించాలని స్థానిక భక్త బృందం సభ్యులు విజ్ఞప్తి చేశారు. ఈ కార్యక్రమంలో భక్తులు ఆకుల మణికంఠ, తోట నాగేశ్వరరావు, దేవా రమేష్, ఆకుల వసంత్, పాపిశెట్టి ప్రసాద్ రామాలయం భక్త బృందం సభ్యులు, స్వర్గీయ గణపతి లక్ష్మణరావు కుటుంబ సభ్యులు పాల్గొన్నారు.

### యువనాయకులు గద్దె క్రాంతి కుమార్ చేతులమీదుగా

# పేద ముస్లిం కుటుంబాలకి రంజాన్ తోఫా







**విజయవాడ తూర్పు, మేజర్ న్యూస్ :** 5వ డివిజన్ అమ్మ కళ్యాణ మండపం ఎదురుగా ఉన్నా మస్జిద్ ఉమర్ వద్ద రంజాన్ పండుగ సందర్భంగా పేద ముస్లిం కుటుంబాలకు టీడీపీ మైనార్టీ నాయకులు షేక్ షరీఫ్ ఏర్పాటు చేసిన 100 కిట్లను గద్దె క్రాంతి కుమార్ చేతుల మీదుగా ఆదివారం సాయంత్రం అందజేశారు. ఒకొక్క కిట్టు రూ. 800 విలువ చేసేవి 100 మందికి పంపిణి చేశారు. ఈ సందర్భంగా గద్దె క్రాంతి కుమార్ మాట్లాడుతూ గతంలో టిడిపి ప్రభుత్వం అధికారంలో ఉన్న సమయంలో పేద ముస్లిం సోదరులకు రంజాన్ పండుగను ఆనందంగా జరుపుకునేందుకు రంజాన్ తోఫా పేరుతో సరుకులు అందజేయడం జరిగింది అన్నారు. తర్వాత అధికారంలోకి వచ్చిన జగన్మోహన్ రెడ్డి ఆ పథకాన్ని నిర్వీర్యం చేశారన్నారు. మరల కూటమి ప్రభుత్వం అధికారంలోకి వచ్చిందని చంద్రబాబు ముఖ్యమంత్రి అయ్యారని ఈ పథకాన్ని వచ్చే రంజాన్ నాటికి పునర్ ప్రారంభించే చర్యలు తీసుకుంటున్నారు అన్నారు. ఈ సందర్భంగా సరుకులు అందజేసిన నాయకులను గద్దె క్రాంతి కుమార్ అభినందించారు. అనంతరం జరిగిన ఇఫ్తార్ కార్యక్రమంలో గద్దె క్రాంతి కుమార్ ముస్లిం సోదరులతో కలిసి పాల్గొన్నారు. ఈ కార్యక్రమంలో ఎస్.కె హాసన్ జానీ, ఎస్. ఫిరోజ్, ఎం.డి ఈక్బాల్, ఎస్. కె.జమాల్, షేక్ షఫీ, కరీం, సిద్దెల వివేక్, ఎస్. అవినాష్ తదితరులు పాల్గొన్నారు.



## మతసామరస్యానికి ప్రతీక ఇఫ్తార్ విందు

### రాష్ట్ర తెలుగు యువత ఉపాధ్యక్షులు డాక్టర్ హసీమ్

**మచిలీపట్నం, మేజర్ న్యూస్ :** పవిత్ర రంజాన్ మాసం మతసామరస్యానికి ప్రత్యేకంగా నిలుస్తుందని, ముస్లింల కోసం ఏర్పాటు చేసే ఇఫ్తార్ విందులు ఆత్మీయతను పెంపొందిస్తుందని రాష్ట్ర తెలుగు యువత ఉపాధ్యక్షులు డాక్టర్ హసీమ్ బేగ్ అన్నారు. ఆంధ్రప్రదేశ్ ప్రభుత్వం జిల్లా స్థాయి కృష్ణా జిల్లా ఆధ్వర్యంలో నిర్వహించిన ఇఫ్తార్ విందులో ఆయన పాల్గొని మంత్రి కొల్లు రవీంద్రకి ఖర్జూరకాయ్ ను తినిపించారు. ఆయనతోపాటు ముస్లిం మత పెద్దలు, యువకులు పెద్దఎత్తున మంత్రికి స్వాగతం పలికారు. అలాగే ఈ కార్యక్రమంలో ఆంధ్రప్రదేశ్ మంత్రి కొల్లు రవీంద్ర, మచిలీపట్నం పార్లమెంటు సభ్యులు వల్లభనేని బాలశౌరి, ఆర్టీసీ చైర్మన్ కొనకళ్ళ నారాయణ రావు, కృష్ణాజిల్లా కలెక్టర్ డీకే బాలాజీ, పెడన ఎమ్మెల్యే కాగిత కృష్ణ ప్రసాద్, తెలుగుదేశం పార్టీ ప్రధాన కార్యదర్శి కొనకళ్ళ బుల్లయ్య, మచిలీపట్నం జనసేన పార్టీ ఇంచార్జ్ బండి రామకృష్ణ గారు, జనసేన నాయకులు మాదివాడ రాము, మచిలీపట్నం మాజీ మున్సిపల్ చైర్మన్ మోటమర్రి బాబా ప్రసాద్, కూటమి నాయకుడు కార్యకర్తలు పాల్గొని ప్రత్యేక ప్రార్థనలు చేసి విందులో పాల్గొన్నారు.



### శ్రీ గోవిందమాల భక్తసమాజం ఆధ్వర్యంలో

## అన్న వితరణ

**విజయవాడ మేజర్ న్యూస్ :** శ్రీ గోవిందమాల భక్తసమాజం గోవిందగురు స్వామి ఏనుగుల వెంకట గాంధీ బాబు ఆధ్వర్యంలో కమిటీ సభ్యులు పుప్పాల అప్పారావు చేతుల మీదుగా పూజ కార్య క్రమం అనంతరం పాత గవర్నమెంట్ హాస్పటల్ దగ్గర అన్నవితరణ కార్యక్రమం నిర్వహించారు. గత నాలుగు సంవత్సరాలుగా అన్నవితరణ కార్యక్రమాన్ని నిర్వహిస్తున్నామని కమిటీ సభ్యులు పేర్కొన్నారు. దాత వాకా అఖిల సహకారంతో అన్నవితరణ చేసినట్లు పేర్కొన్నారు.ఈ కార్యక్రమంలో కమిటీ సభ్యులు ఏనుగుల వెంకట శ్రీనివాస్, గోపి చందన సురేష్,సముద్రాల వినయ్ కుమార్, గద్దల ధనలక్ష్మి, దత్తి జ్యోతి, తదితరులు పాల్గొన్నారు.



## సహాయ ఫౌండేషన్ పేదవాడి ఫౌండేషన్

**మచిలీపట్నం మేజర్ న్యూస్ :** ఉగాది పర్వదినాన్ని పురస్కరించుకుని ఆదివారం మచిలీపట్నంలో వేసవి లో ప్రజల దాహార్తి తీర్చే మజ్జిగ పంపిణీ కార్యక్రమం నిర్వహించడం జరిగింది. రాబోయే రోజుల్లో ఈ వేసవిలో అధిక ఉష్ణోగ్రతలు నమోదయ్యే అవకాశం ఉందని ప్రజల దాహార్తిని తీర్చేందుకు సహాయ ఫౌండేషన్ మెట్రో కూలింగ్ చలివేంద్రాలు ఏర్పాటు చేస్తుందని సహాయ ఫౌండేషన్ అధ్యక్షులు ఉస్మాన్ బాషా తెలిపారుఈ కార్యక్రమంలో సంస్థ అధ్యక్షులు మొహమ్మద్ ఉస్మాన్ బాషా,అంకాల రామకృష్ణ, తుమ్మల వర ప్రసాద్,బడుగు ఉమ, సుధాబత్తుల లక్ష్మి కుర్షీద్ బేగం,విన్నకోట సంధ్య, తోట విజయకుమారి,కొల్లు కాశీ విశ్వనాథ్,అనిల్,సప్పరపు రాజు తదితరులు పాల్గొన్నారు

## ఇఫ్తార్ ఇందులో పాల్గొన్న ఎమ్మెల్యే కుమార్ రాజా



**పమిడిముక్కల మార్చి 30 మేజర్ న్యూస్ :** పమిడిముక్కల మండల పరిధిలోని ఫత్తేలంక గ్రామంలో జరిగిన ఇఫ్తార్ విందులో పామర్రు శాసనసభ్యులు వర్ల కుమార్ రాజా పాల్గొన్నారు. ఈ సందర్భంగా గ్రామంలోని ముస్లిం పెద్దలు ఎమ్మెల్యే కుమార్ రాజాకు ఘనంగా స్వాగతం పలికారు. అనంతరం ఆయన కొద్దిసేపు ముస్లింలతో గడిపారు. ఇఫ్తార్ విందులో భాగంగా ముస్లిం సోదరులతో కలిసి సహపంక్తి భోజనం చేశారు. మతసామరస్యా నికి ప్రత్యేకంగా నిలిచే రంజాన్ ఉపవాస దీక్షలను ముస్లింలు అత్యంత భక్తిశ్రద్ధలతో జరుపుకోవడం పట్ల హర్షం వ్యక్తం చేశారు. సోమవారం జరుగనున్న పర్వదినాన్ని ముస్లింలు అత్యంత ఘనంగా జరుపుకోవాలని ఆకాంక్షిస్తూ వారికి శుభాకాంక్షలు అందజేశారు. ఈ కార్యక్రమంలో తెలుగుదేశం పార్టీ సీనియర్ నాయకుడు జక్కా శ్రీనివాసరావుతో పాటు పలువురు నాయకులు, కార్యకర్తలు కూడా పాల్గొన్నారు.



## మిత్ర హాస్పిటల్లో అత్యాధునిక వైద్య సేవలు

**అనుభవజ్ఞులైన వైద్య నిపుణుల ఆధ్వర్యంలో నూతన ఆసుపత్రి ప్రారంభం**

**పారదర్శకంగా రోగ నిర్ధారణ.. పరిపూర్ణ వైద్య చికిత్సలు.. అత్యున్నత ఫలితాలు**

**ప్రజలకు మెరుగైన సేవలందిస్తామని డాక్టర్ కె. దుర్గా నాగరాజు వెల్లడి**



**విజయవాడ మేజర్ న్యూస్ :** మహానగరాలకు దీటుగా ఈ ప్రాంత ప్రజలకు అత్యాధు నిక వైద్య సేవలను అందించే లక్ష్యంతో మిత్ర హాస్పిటల్ ప్రారంభమైంది. ఉగాది పర్వదినం సందర్భంగా సూర్యారావుపేట నరసింహ నాయుడు వీధిలో నూతన హాస్పిటల్ ను ఆదివారం లాంఛనంగా ఆరంభించారు. అత్యంత అనుభవజ్ఞులైన వైద్య నిపుణుల ఆధ్వర్యంలో, అంతర్జాతీయ స్థాయి ప్రమాణాలతో చికిత్సలందించేలా మిత్ర హాస్పిటల్ ను తీర్చిదిద్దారు. ప్రఖ్యాత ఆర్థోపెడిక్ సర్జన్ డాక్టర్ కె. దుర్గా నాగరాజు, యూరాలజిస్ట్ డాక్టర్ సతీష్ మర్రివాడ, పీడియాట్రిక్ అండ్ నియోనేటల్ సర్జన్ డాక్టర్ కె.వి. రవికుమార్, అనస్థిషియాలజిస్ట్ డాక్టర్ పి. విశ్వేశ్వరరావు.. ఈ హాస్పిటల్లో సేవలందిస్తారు. మిత్ర హాస్పిటల్ ప్రారంభోత్సవంలో ప్రముఖ ఆర్థోపెడిక్ సర్జన్ డాక్టర్ దీనదయాళన్, స్పైన్ సర్జన్ డాక్టర్ అజోయ్ ప్రసాద్ శెట్టి, యూరాలజిస్ట్ డాక్టర్ సుబ్బారావు చోడిశెట్టి, ఏజీహెచ్ చైర్మన్ డాక్టర్ జి. రమేష్, కన్సల్టెంట్ ఫిజీషియన్ డాక్టర్ పి. చంద్రశేఖర రావు తదితర ప్రముఖులు పాల్గొని, నిర్వాహకులకు అభినందనలు తెలియజేశారు. ఈ సందర్భంగా డాక్టర్ కె. దుర్గా నాగరాజు మీడియాతో మాట్లాడుతూ.. ప్రజలకు మెరుగైన వైద్య సేవలను అందిస్తామని అన్నారు. పారదర్శకంగా రోగ నిర్ధారణ, పరిపూర్ణ వైద్య చికిత్సల ద్వారా అత్యున్నత ఫలితాలు సాధిస్తాని వెల్లడించారు. తమ హాస్పిటల్లో ఎన్టీఆర్ వైద్య సేవ ద్వారా అల్పాదాయ వర్గాల వారికి వైద్య చికిత్సలు అందుబాటులో ఉన్నాయని తెలియజేశారు. మహా నగరాలకు దీటుగా అత్యాధునిక ప్రమాణాలతో చికిత్సలందిస్తామని డాక్టర్ దుర్గా నాగరాజు పేర్కొన్నారు.

## చందన, పండ్ల అలంకారంలో సుదర్శన వెంకటేశ్వర స్వామి దర్శనం





విజయవాడ **మేజర్ న్యూస్ :** న్యూ రాజరాజేశ్వరి పేటలో వేంచేసియున్న శ్రీ సుదర్శన వెంకటేశ్వర స్వామి దేవస్థానంలో శ్రీ విశ్వావసు నామ సంవత్సర ఉగాది సందర్భంగా స్వామివారికి విశేషంగా చందన, పండ్ల అలంకారం రూపంలో స్వామివారు భక్తులకు విశేషంగా దర్శనం ఇచ్చారు. ఆలయ ధర్మకర్త వేదాంతం ప్రవీణాచార్యులు ఉగాది కార్యక్రమాలను పర్యవేక్షించారు. అనంతరం ఆయన మాట్లాడుతూ శ్రీ విశ్వావసు నామ సంవత్సరానికి స్వాగతం పలుకుతూ భక్తులందరికీ ఈ నూతన సంవత్సరం అంతా మేలు జరగాలని, ఆయురారోగ్య, సుఖ సంతోషాలతో విలసిల్లాలని స్వామి వారి ఆశీస్సులు మనందరిపై నిత్యం ఉండాలని కోరుకుంటున్నామని అన్నారు. ఈ కార్యక్రమంలో కేదారేశ్వరపేట బీజేపీ మండల అధ్యక్షులు మాగులూరి లవింగ్ బాబు, జనరల్ సెక్రటరీ నున్న కృష్ణ, బీజేపీ జనరల్ సెక్రటరీ నున్న కృష్ణ, భక్తులు అధిక సంఖ్యలో పాల్గొన్నారు.

18 వసంతాల 'సూర్య' మహాయజ్ఞంలో 'సూర్య' అక్షర సైనికుల భాగస్వామ్యంతో అనితర సాధ్యం కాని ఎన్నో లక్ష్యాలను అధిగమించింది. ఈ ప్రస్థానంలో సూర్యాక్షరంతో మమేకమైన 'సూర్య' కుటుంబ సభ్యులందరికీ అక్షర నమస్సులు. మాకు తోడుగా నిలుస్తున్న పాఠకులకు, మిత్రులకు, శ్రేయోభిలాషులకు పేరుపేరున కృతజ్ఞతాభివందనాలు.

ఇట్లు
ఎన్.వెంకట్, ఎన్టీఆర్ - కృష్ణా బ్యూరో
ఫోన్ : 9642 980 999